సీపీఐ కార్యాలయంలో భగత్ సింగ్ 92వ వర్ధంతి

విశాలాంధ్ర-కడప రూరల్ : స్వాతంత్ర్యానంతరం సాధించుకున్న ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న నేపథ్యంలో భగత్‌సింగ్ స్వాతంత్ర ఉద్యమ పోరాట స్ఫూర్తితో పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సిపిఐ నగర కార్యదర్శి యన్.వెంకటశివ పేర్కొన్నారు. సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్ 92వ వర్ధంతి కార్యక్రమం ఎన్టీఆర్ నగర్‌లోని సిపిఐ నగర కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటా నికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి యన్. వెంకట శివ మాట్లాడుతూ భారత బానిస సంకెళ్లు విడిపించేందుకు బ్రిటిషర్ల ఉరి కొయ్యలకు ఊపిరి వదిలిన మహనీయుల స్వాతంత్రో ద్యమ చరిత్రను పాఠ్యపుస్తకాల చేర్చి భావి భారత పౌరులను చైతన్యవం తం చేయాలన్నారు. భగత్ సింగ్ కలలు గన్న స్వాతంత్ర ఫలాలు అందరికీ దక్కకముందే పాలకులు సహజ సంపదను, ప్రభుత్వ వ్యవస్థ ను కార్పొరేట్లకు తాకట్ట పెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమం లో సిపిఐ నగర సహాయ కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, నగర కార్యవర్గ సభ్యులు భీమరాజు, అంకుశం, శంకర్ నాయక్, నారాయణ, రాపూరి మధు, రాహుల్, జాన్సన్, వెంకటస్వామి, సుంకమ్మ పాల్గొన్నారు.

బావిలో పడి యువకుడి మృతి

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: ఈతరాని ఓ యువకుడు బావిలో దూకి మృతి చెందాడు. ఈ విషాద సంఘటన వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణ పరిధిలోని యర్రగుడిపల్లె గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామంలో ఉగాది పార్వపూట ఈ దుర్ఘటన విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే..యర్రగుడిపల్లికి చెందిన లక్కె సుబ్బమ్మ, సుబ్బరాయుడు దంపతుల ద్వితీయ కుమారుడు గణేష్ (19) అను యువకుడి స్నేహితులతో కలిసి పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి సమీపంలోని బావి వద్దకు వెళ్లారు. ఈతరాని గణేష్ పొరబాటున ప్రమాదశాత్తూ బావిలో పడిపోయారు. గణేష్‌ను తోటి స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినా విఫలమైంది. ఆ తర్వాత ఈ విషయాన్ని విపత్తుల నిర్వహణశాఖ అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయ డంతో వారు హుటాహుటిన సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. గణేష్‌ను బయటకు తీసి వైద్యచికిత్స కోసం 108 వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించారు. బావిలో నుండి గణేష్‌ని వెలికి తీసి రక్షించే ప్రయత్నంలో భాగంగా 108 లో పులివెందుల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారణ చేసి పోస్ట్ మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. గణేష్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ సంఘటనపై అన్ని కోణాలల్లో దర్యాప్తు చేసి అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గ్రామంలో ఉగాది పార్వరోజున యువకుడి మృతి గ్రామస్థులను కలచివేసింది. వేసవిరావడం పట్ల చాలా మంది ఈతకొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ ఈతరాని వాళ్లు బావులు, చెరువుల వద్దకు వెళ్లవద్దని స్థానికులు కోరారు.

భగత్‌సింగ్ వర్ధంతి, జయంతిని ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-బద్వేల్ : బద్వేల్ పట్టణంలోని బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఏఐఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి 92వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ బద్వేల్ ఏరియా కార్యదర్శి ఎం.అశోక్ మాట్లాడుతూ యువతకు ఉత్తేజం పోరాట కాంతి కిరణం షాహిద్ భగత్ సింగ్ అన్నారు. భగత్ సింగ్ 23 సంవత్సరాల వయసులో భారతదేశ కోసం ప్రాణత్యాగం చేసిన మరణం లేని అమరు డు, బ్రిటీష్ ముష్కరుల గుండెల్లో దడ పుట్టించి ధైర్యానికి సాహసానికి త్యాగనిరతికి భగత్ సింగ్ నిలువెత్తు నిదర్శనమయ్యాడన్నారు. భగత్‌సింగ్ జయంతి, వర్ధంతిలను ప్రభుత్వ అధికారికంగా నిర్వహిం చాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విజ్ఞతితో ఆలోచించి షాహిద్ భగత్‌సింగ్ జయంతి (సెప్టెంబర్ - 27) న వర్ధంతి (మార్చి-23) న ప్రభుత్వ అధికారికంగా నిర్వహించి భగత్‌సింగ్‌ని భార తరత్నగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు కిరణ్, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక సేవా పురస్కారం అందుకున్న రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర-కాశినాయన : మండలంలోని ఓబులాపురం సగిలేరు నది ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి కి బుధవారం బద్వేలు నందు బద్దెన కళా పీఠం నిర్వహించిన ఉగాది వేడుకల్లో సామాజిక సేవా పురస్కారం అందు కున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఆర్డీవో వెంకటరమణ మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, సర్వశిక్ష అభియాన్ పీఓ అంబవరం ప్రభాకర్ రెడ్డి లు సేవా పురస్కారం కింద 6 వేల నగదు, ప్రశంస పత్రం, జ్ఞాపిక, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ డిసి గోవింద రెడ్డి, ఆర్డీవో వెంకటరమణ మాట్లాడుతూ చిన్న వయసులో గొప్ప మనసుతో రామకృష్ణ చేస్తున్న సేవలు నేటి యువతకు ఆదర్శప్రాయమన్నారు. మారుమూల గ్రామంలో పుట్టిన రామకృష్ణ రాష్ట్ర స్థాయిలో జిల్లాకే వన్నె తెస్తున్నాడని అభినందనలు తెలిపారు. ఆయనకు తోడు ఆయన సతీమణి రామ తులసి కూడా వివేకానంద సేవాశ్రమం నిర్వహిస్తూ, సమాజ సేవ చేస్తూ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నరన్నారు. ఈ పురస్కారం రావడం పట్ల రామకృష్ణా రెడ్డి తన బాధ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు. అనంతరం బద్దెన కళా పీఠం అధ్యక్షుడు సాంబ శివా రెడ్డి రామకృష్ణారెడ్డి సేవలను ప్రశంసిస్తూ పంచ పద్యాలను ఆలపించారు.

ఘనంగా కుందేళ్ల పార్వేట

విశాలాంధ్ర-లింగాల: లింగాలలో గురువారం కుందేళ్ల పార్వేటను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఉగాది పార్వ రోజున పార్వేట నిర్వహించడం పరిపాటి. ఈ క్రమంలో గ్రామంలోని యువకులు పండుగ రోజు అడవులకు వెళ్లి కుందేళ్లను పట్టుకొస్తారు. తర్వాత సాయంత్రం పార్వరోజు సీతారామ లక్ష్మణ విగ్రహాలతో పాటు కుందేళ్లను గ్రామ శివార్లలోకి తీసుకెళ్తారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేటను ప్రారంభిస్తారు. అవి పరుగెత్తుతుంటే వాటిని పట్టుకోవడం తిరిగి వాటిని వదలేయడం సరదాగా ఉంటుంది. ఇలా అలసి సొలసిన తర్వాత పొద్దుగూకే సమయానికి వాటిని వదలేస్తారు. వైసీపీ పార్లమెంటరీ సెక్రటరీ సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ పార్వేట నిర్వహించారు. ఇలా చేయడం వల్ల గ్రామానికి మంచి జరుగుతుందని గ్రామస్థుల నమ్మకం. ఏడాది పొడవునా అంతా మేలు జరగాలని ఆశిద్దాం.

యర్రగుంట్లపై కాలుష్యకాటు

- ఫ్లయాష్‌తో నరకయాతన
- యధేచ్ఛగా అధికటన్నేజి రవాణా
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : పారిశ్రామిక అభివృద్ధి ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజలు అన్ని రకాలుగా అభివృద్ధిలోకి వస్తారని పాలకులు పదే పదే చెబుతుంటారు. ప్రజల అభివృద్ధి మాట అలా ఉంచి పారిశ్రామిక ప్రాంత ప్రజలు నరకయాతన అనుభవిస్తున్న దృశ్యం కనిపిస్తుంది. నిన్న మొన్నటి వరకు సిమెంటు రంగ పరిశ్రమల ద్వారా కాలుష్యాన్ని భరించిన ప్రజలకు నేడు ఫ్లయాష్ రూపంలో కష్టాలు మొదలయ్యాయని చెప్పవచ్చు. ఇక్కడి రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి (ఆర్టీపీపీ) ప్రతి రోజు వందల సంఖ్యలో ట్యాంకర్లు, టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఫ్లయాష్ (బూడిద)ను పలు ప్రాంతాలకు చేరవేస్తుంటారు. ముఖ్యంగా ఎర్రగుంట్ల మండలంలోని ఐసీఎల్, జువారి, కమలాపురం మండలంలోని భారతి సిమెంటు పరిశ్రమ, మైలవరం మండలంలోని రామ్‌కో, దాల్మియా, తాడిపత్రి సమీపంలోని అల్ట్రాటెక్, బనగానపల్లె సమీపంలోని మహా సిమెంటు పరిశ్రమలతో పాటు పలు ఫ్లయాష్ బ్రిక్స్ (సిమెంట్ ఇటుకలు) తయారీ కేంద్రాలకు కూడా ఫ్లయాష్ బూడిద రవాణా అవుతోంది. అయితే కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల మేరకు ట్యాంకర్లు, క్లోజ్‌డు వాహనాల ద్వారా మాత్రమే ఈ బూడిదను రవాణా చేయాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా ట్రాన్స్‌పోర్టు యజమానులు సుమారు 70 టిప్పర్ల ద్వారా రోజుకు 200 ట్రిప్పులకు తగ్గకుండా రవాణా చేస్తూ ప్రజారోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. టిప్పర్లు తడి బూడిదను తీసుకెళుతూ రోడ్ల వెంబడి వెదజల్లుతున్నారు. ఈ తడి బూడిద ఆరిన వెంటనే వాహనాలు వెళ్లే సమయంలో గాలిలో కలిసి కాలుష్యం నెలకొంటోంది. అనివార్యంగా ప్రజలు ఈ కాలుష్యాన్ని పీల్చుతూ శ్వాసకోస, చర్మవ్యాధుల బారిన పడడం తో పాటు గుండె జబ్బులకు గురవుతున్నారు. ఆర్టీపీపీ లోని ఫ్లయాష్ ప్లాంటు వద్ద తొలుత నీటిలోని బూడిదను పక్కకు చేర్చి ఆరిన పిదప రవాణా చేయాల్సి ఉంటుంది. కానీ అందుకు భిన్నంగా తడి బూడిదను టిప్పర్లకు నింపుతున్నారు. సదరు టిప్పర్లు బూడిద నీరు కార్చుకుంటూ వెళుతుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఎర్రగుంట్ల పట్టణ ప్రజలతో పాటు చిలమకూరు, పోట్లదుర్తి, మాలేపాడు, కలమల్ల గ్రామాల ప్రజలు సైతం ఇదివరకే టిప్పర్లను అడ్డుకొని తమ నిరసన వ్యక్తం చేసిన సంగతి విదితమే. అయితే ట్రాన్స్‌పోర్టు యజమానులు మాత్రం ప్రజల అభ్యంతరాలను బేఖాతరు చేసి తమ రవాణాను కొనసాగిస్తున్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం స్పందించకపోవడం గమనార్హం.

అధిక టన్నేజీతో రవాణా: 30 టన్నులు రవాణా చేయాల్సిన వాహనాలు 45 టన్నులు, 35 టన్నులకు 50 టన్నులు, 38 టన్నులు రవాణా చేయాల్సి ఉండగా 60 టన్నుల వరకు మోసుకెళుతూ రోడ్లను సైతం దెబ్బతినేలా చేస్తున్నాయి. అధిక టన్నేజీ కారణంగా అనేక రోడ్డు ప్రమాదాలు జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ రవాణా శాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఏ కారణం చేతనో ఈ వ్యవహారంపై రవాణా శాఖ స్పందించడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. వాహనాల ఇన్సూరెన్స్‌కు సంబంధించిన పత్రాలు సదరు వాహనంలో లేనిపక్షంలో జరిమానాలు విధించే రవాణా శాఖ అధికారులు అధిక టన్నేజీ రవాణాపై ఎందుకు స్పందించరో సమాధానం చెప్పాల్సి ఉంది. ఈ వ్యవహారంపై మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లె గ్రామ సర్పంచ్ తాడిమె మణినాథరెడ్డి మాట్లాడుతూ తనకు సంబంధించిన నాలుగు టైర్ల బొలెరా క్యాంపర్ వాహనంలో సదరు ఇన్సూరెన్స్ పత్రాలు లేవని ప్రొద్దుటూరుకు చెందిన రవాణా శాఖ అధికారులు ఈ నెల 12వ తేదీన జరిమానా విధించిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ ఫ్లయాష్ వాహనాలు యధేచ్ఛగా నిబంధనలకు విరుద్ధంగా అధిక టన్నేజీతో తిరుగుతున్నప్పటికీ అధికారులకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. నిబంధనలను తప్పక అమలు చేయాల్సిన అధికారులు ఒక్కో చోట ఒక్కోలా వ్యవహరించడం వెనుక ఏ రహస్యం దాగి ఉందని ఆయన ప్రశ్నించారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడుదాం: సీపీఐ

విశాలాంధ్ర-బద్వేల్ : భారతదేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను పూర్తిగా తీసుకొని యువత ముందుకెళ్లాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి. వీరశేఖర్ అన్నారు. సర్దార్ భగత్ సింగ్ 92 వ వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ భగత్ సింగ్ 1907 సెప్టెంబర్ 28 న లాహోర్ సమీపంలోని బంగా అనే గ్రామంలో కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించారని, జాతీయ భావాలు, పోరాట సాంప్రదాయం కలిగిన కుటుంబం సర్దార్ భగత్ సింగ్ ది అని అన్నారు. పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఏ. మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ తెల్లదొరలు పోయి నల్ల దొరలు వస్తే ఆ స్వాతంత్ర్యం వట్టి బూటకం అని అప్పుడే భగత్సింగ్ అన్నారు అని, భగత్ సింగ్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్క విద్యార్థి,యువత పోరాడాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు పరచాలని డిమాండ్ చేశారు.లౌకిక భారత రక్షణకై విద్యార్థి యువజనులు భగత్ సింగ్ పూర్తితో నడుం బిగించి పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి జకరయ్య. సహాయ కార్యదర్శి చంద్ర మోహన్ రాజు. పట్టణ కార్యదర్శి పి.బాలు. కార్యవర్గ సభ్యులు పివి రమణ. విజయమ్మ. ఆర్.శీను. పెంచలయ్య, కె.బాబు, నాగసుబ్బయ్య, సుబ్బా రెడ్డి నాయకులు తిరుపతి, సిద్ధయ్య, లచ్చమ్మ, రవి, తదితరులు పాల్గొన్నారు.

రోజువారి గేటు రుసుము ఎత్తివేయాలి

విశాలాంధ్ర - మైదుకూరు : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక మైదుకూరు మున్సిపాలిటీ కార్యాలయం నందు మున్సిపల్ కమిషనర్ కి ఏఐటియుసి నాయకులు ఆటో మరియు తోపుడుబండ్ల మీద రోజు వారి గేటు రుసుము వసూలు చేయడాన్ని ఈ ఆర్థిక సంవత్సరం నుండి నిలుపుదల చేయాలని వారు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏ.ఐ.టి.యు.సి. జిల్లా కార్యదర్శి పి.శ్రీరాములు, ఏ.ఐ.టి.యు.సి. మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి ఏ.వి.శివరామ్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఒక మైదుకూరులో మాత్రమే ఈ విధమైన రుసుము వసూలు చేయడం దుర్మార్గకరమని వారన్నారు. కావున ఇకనైనా ఈ విధమైన రుసుమును వసూలు చేయడం నిలుపుదల చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బి.కే.ఎం.యు. నాయకులు ఎస్.షావలి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బి.పీరయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ మరియు తోపుడుబండ్ల యూనియన్ నాయకులు ఖాదర్,మాబు హుస్సేన్, షాపూన్ భాషా, ప్రసాద్, జయరాజ్, జబ్బీర్, నాగేష్, సురేష్, వలి, బాలు, రంతు భాషా, గౌస్, నరసింహ, నూర్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు సాగాలి



విశాలాంధ్ర-పులివెందుల టౌన్: విద్యార్థుల ఏదైనా ఒక లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఆహార విజ్ఞానశాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ ఎమ్ఎస్ బేగ్ అన్నారు. ఫుడ్ టెక్నాలజీ కళాశాలలో రెండు రోజుల పాటు ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో స్థిరపడాలంటే ఒక లక్ష్యం పెట్టుకొని ముందుకు సాగాలని, దీని వల్ల ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి వీలుగా ఉంటుందన్నారు. అసోసియేట్ జీన్ .అధ్యాపకులు స్వయంగా ఉగాది పచ్చడిని తయారు చేయటం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అధ్యాపకులు, విద్యార్థులు సాంప్రదాయ వస్త్రాలు ధరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో అధ్యాపకులు ఏడుకొండలు. అరుణ, రాజేష్, జయమ్మ, నజ్మా, నావేదిత, సాయిశ్రీనివాస్, రాజశేఖర్, పావన దీప్తి, ఇతర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు మృతికి సంతాపం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: సీనియర్ జర్నలిస్టు దేవిరెడ్డి ప్రసాద్ రెడ్డి మృతికి ప్రొద్దుటూరు జర్నలిస్టులు తమ సంతాపాన్ని వెలిబుచ్చారు. ప్రొద్దుటూరు ప్రెస్‌క్లబ్‌లో శ్రీనాథ్‌రెడ్డి చిత్రపటానికి జర్నలిస్టులు పూలమాలలు వేసి ఘణం గా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు సుందర్ రాజు, రవీలు మాట్లాడుతూ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి గత 40సంవత్సరాలుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతూ యూనియన నాయకులుగా, ఇండియన్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులుగా పనిచేసిన శ్రీనాథ్‌తెడ్డి మనమధ్య లేకపోవడం బాధాకరం అన్నారు. ఆయన మృతి జిల్లా జర్నలిస్టు లోకానికి తీరనిలోటు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

అమృతనగర్‌లో వ్యక్తి హత్య

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీలో గల అమృతనగర్‌లో రాము అనే వ్యక్తి హత్యకు గురైనట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రొద్దుటూరు పట్టణం కోనేటికాల్వ వీధిలో నివాసం ఉంటున్న కురవ రాము ఉగాది పండుగ సంధర్భంగా అమ్మవారికి దేవర నిర్వహిస్తుండగా రాము తమ్ముడు ఇంటికి అమృత నగర్‌కు కుటుంబసభ్యులు, బంధువులు వచ్చారు. బుధవారం రాత్రి తన స్నేహితులతో కలిసి మద్యం సేవించాడని తరువాత రాము కనిపించలేదన్నారు. తెల్లవారే సరికి సబ్‌స్టేషన్ 18వ లైన్‌లో రాము రక్తపుమడుగులో మృతి చెంది ఉండటంతో స్థానికులు, బంధువులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు రామును హత్యచేసి ఉంటారనే కోనంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం

విశాలాంధ్ర-సిద్దవటం : మండల కేంద్రమైన సిద్ద వటం పోలీస్ క్వార్టర్స్ ఆవరణలో శ్రీ నిత్యపూజయ్య స్వామి ఆలయం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ప్రధాన అర్చకులు రంగ సముద్రం సుబ్రహ్మణ్యం శర్మ, అర్చకులు ప్రదీప్ శర్మ, క్రిష్ణ చైతన్య శర్మలు ముందుగా గణపతి పూజ, పుణ్యాహ వచనం, సహస్ర నామ కుంకుమార్చన, కంకణా ధారణ, యజ్ఞోపధారణ, జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు, మహానివేదన, మంగళహారతి వంటివి నిర్వహించి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో సిద్దవటం వైఎస్ఆర్సీపీ మండల ఇంచార్జి మేడా మధుసూదన్ రెడ్డి, నిత్యపూజస్వామి ఆలయం చైర్మెన్ కొండారెడ్డి, ఈఓ మోహన్ రెడ్డి, జెట్పీటీసి సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు నారాపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కే.వి సుబ్బయ్య, సచివాలయ మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, ఆలం చైతన్య, ప్రసాద్ రెడ్డి, సయ్యద్ హిదాయతుల్లా, కుప్పం సుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల మీద ఎలాంటి వస్తువులు పెట్టొద్దు: ఎస్ఐ

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : కడప జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తమ రాజు సలహా మేరకు ఒంటిమిట్ట-చెన్నై ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌ల మీద దుకాణ యజమానులు పాదాచారులకు ఆటంకం కలిగించకుండా ఎలాంటి వస్తువులు పెట్టకూడదని ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు అన్నారు. గురువారం ఒంటిమిట్టలోని రోడ్డుకు ఇరువైపుల ఫుట్‌పాత్‌లపై ఉన్న వస్తువులను దుకాణ యజమానులను పిలిచి ఫుట్‌పాత్‌లు కేవలం పాదాచారుల కోసమేనని ఎలాంటి వస్తువులు పెట్టరాదని అలా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ మల్లి, సునీల్, హెూంగార్డు సుబ్బయ్య, రాజా పాల్గొన్నారు.

ఘనంగా సేవ్ జర్నలిస్ట్ డే

విశాలాంధ్ర - మైదుకూరు : స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ వర్కింగ్ జనలిస్ట్ మైదుకూరు నియోజకవర్గ విలేకరుల సమావేశం.ముఖ్య అతిథిగా పాల్గొన్న మైదుకూరు రురల్ సిఐ నరేంద్ర రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్, మల్లికార్జున ,మునిసిపల్ కమిషనర్ రాముడు,సేవ్ జర్నలిస్ట్ దే దినోత్సవాన్ని పురస్కరించుకొని మైదుకూరు నియోజకవర్గ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కరెడ్ల క్రిష్ణ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం వెంకటశివ విజన్ ఐటెల్ ఆప్టికల్స్ సహకారం తో ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ అభిలాష్ ఎం ఎస్ ఆప్తమాలజికంటి వైద్య నిపుణులు విలేకరులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు.కంటి అద్దాలు అవసరమైన వారికి 50 శాతం రాయితీతో అందించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ విలేకరులు మీడియా ప్రతినిధులు సమాజం పట్ల బాధ్యతగా అవినీతిని వెలికి తీసే క్రమంలో అనేక ఇబ్బందులకు లోనైనా కూడా తమ వృత్తిని నిబద్ధతగా చేయడం జరుగుతుందన్నారు.ఉద్యోగులుగా మేము జీతాలు తీసుకుని బాధ్యతలు నిర్వహిస్తే సమాజం కోసం విలేకరులు ఎటువంటి ఆశ లేకుండా కుటుంబాలను సైతం లెక్కచేయకుండా వార్తలు రాసి తమ విధినిర్వర్తిస్తారన్నారు. విలేకరుల సేవలు వెలకట్టలేనివి ప్రస్తుతం చాలా కొత్త విధానంలో వార్తలను అంది స్తోంది అన్నారు. విలేకరులకు సైతం క్షమా గుణం ఉంటుందని కొనియాడారు. అనం తరం సీనియర్ జర్నలిస్టు మాజీ చైర్మన్ శ్రీనాథ్ రెడ్డి మృతి పట్ల రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.పత్రికా స్వేచ్ఛను కాపాడాలని విలేకరులపై దాడులను అరి కట్టాలని కోరుతూ మైదుకూరు నియోజకవర్గం ఏపీడబ్ల్యుజె ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కర్రెడ్లకృష్ణ ఆధ్వర్యంలో మైదుకూరు మండల తాహసిల్దార్ అనురాధ రూరల్ సీఐ నరేంద్ర రెడ్డిలకు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమానికి మైదుకూరు నియోజకవర్గం ఏపీడబ్ల్యూజే గౌరవ అధ్యక్షులు, బొమ్మిశెట్టి మోహన్ కసెట్టి చంద్రమోహన్ సిగినేని మురళి మండల అధ్యక్షులు జగన్ ,సంజీవ్ , చంద్ర ,సుధాకర్ రెడ్డితోపాటు ఏపీడబ్ల్యూజే నియోజకవర్గ విలేకరులు తోట రామ్మోహన్, బండి చిన్నయ్య,యాపరాల ప్రసాద్ , ప్రసాద్ చొక్కం యపరాల వెంకటసుబ్బయ్య జయరాం ప్రసాద్ గంగారావు, చంటి, కుమార్, రంజిత్ సునీల్ సుబ్బయ్య వర్ధన్ కమిటీ సభ్యులు,ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సిద్దవటం కోట అద్భుతం

కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్

విశాలాంధ్ర-సిద్దవటం : ఆహ్లాదక వాతావరణంలో నిర్మించిన సిద్దవటం కోట అద్భుతంగా ఉందని కర్నూలు రేంజ్ డీఐజీ డీఐజీ సెంథిల్ కుమార్ కొనియాడారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల పర్య వేక్షణలో భాగంగా బుధవారం కోదండరామస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆయన సిద్దవటం కోటను సందర్శించారు. కోటలోని కట్టడాలకున్న శిల్పకళా సంపద అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. నాటి రాజుల పాలనకు సజీవ సాక్ష్యంగా కోట నిలిచిందన్నారు. విభిన్న మతాల సాంస్కృతి సంప్రదాయాలతో కూడిన కట్టడాలు కోటలో ఉన్నాయని కోట భిన్నత్వంలో ఏకత్వాన్ని తలపించేలా ఉందన్నారు. చరిత్రాత్మక కట్టడమైన కోటలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు పురాతత్వ శాఖకు లేఖను రాయడం జరిగిందన్నారు. మొదటి మండపం, రెండవ మండపం, డంకా నగర్, ఈద్గా, దెబ్బతిన్న నంది విగ్రహం, కామాక్షి గుడి గుప్తనిధుల త్రవ్వకాల్లో బయల్పడిన శివలింగాన్ని పరిశీ లించారు. అలాగే పరకోటలోని టిప్పుసుల్తాన్ నిర్మించిన సయ్యద్ -షా -బిస్మిల్లా-షావలి దర్గాను సందర్శించి దర్గా నిర్మాణం ఎప్పుడు జరిగిందని దర్గా విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. కడప నవాబు నిర్మించిన మసీదును, రాణి స్నానపు తొట్టి, రాణి మహల్, రాజ మహల్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం మొదటి మండపంలో కుటుంబ సభ్యులతో కలిసి కాసేపు సేదదీరారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, సిద్దవటం ఎస్సై తులసి నాగ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విందులో పాల్గొన్న టీడీపీ ఇంచార్జ్ భూపేష్‌రెడ్డి

విశాలాంధ్ర-కొండాపురం: ఉగాది పార్వ సంధర్భంగా మండలంలోని దత్తాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పోలు వెంక టేశ్వర రెడ్డి ఏర్పాటుచేసిన విందు కార్యక్రమంలో జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ దేవగుడి భూపేష్ రెడ్డి పాల్గొన్నారు. మొదటగా గ్రామంలోని పెద్దమ్మతల్లికి పూజలు చేసి శోభకృత నామ సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. అనంతరం తాళ్ల ప్రొద్దుటూరు, ఎర్రగుడి గ్రామాల్లో ఎర్రప్ప గారి వెంకటరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెండేదుల్ల రామాంజ నేయుల రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, అంకిరెడ్డి, హరిచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టిన సిగ్గు రావడం లేదు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : జగన్ నియంత పాలన అనేది ప్రజా స్వామ్యంలో చాలా రోజులు నిలబడదు, రాజకీయాల్లో ప్రజలకు అబద్ధాలు మోసాలు అక్రమాలు అన్యాయాలు భయభ్రాంతులు చేసి అధికారంలోకి వచ్చాము, తర్వాత మేము ఏది చేస్తే అదే శాసనం అని అనుకోవడం పొరపాటు, ప్రజలు అన్ని గమనిస్తుంటారు సమయం వచ్చినప్పుడు కొర్రు కాల్చి వాత పెడతారని టీడీపీ నగర ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య అన్నారు. అప్పుడు కూడా మారకుండా ఒక నియంతల ప్రవర్తిస్తే ప్రజలు శాశ్వతంగా ఇంట్లోనే కూర్చోబెడతారన్నారు. ఇప్పటికైనా మీరు మారి ప్రజలు ఏమి కోరుకున్నారు వాళ్లకు ఏమి చేయాలని ఆలోచిస్తే మేము కూడ మీకు సహరిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో సిటీ యువజన విభాగం అధ్యక్షుడు మేకల వెంకటేష్, పఠాన్, ఖాజా పీర్, శ్రీనివాసులు, భరత్ కుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కోల్పోయిన వారికి పరిహారం అందిస్తాం

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : జాతీయ రహదారికి లక్కిరెడ్డి పల్లి లో ఇరుపక్కల ఇల్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందిస్తామని అన్నమయ్య జిల్లా ఆర్డీవో రంగస్వామి పేర్కొన్నారు గురువారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో ఇల్లు కోల్పోయిన 120 మంది బాధితులతో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం చదరపు గజానికి 4,563 అందిస్తామని ఆయన బాధ్యతలు తెలిపారు. అలాగే రోడ్డుకు ఎక్కువ స్థలాలు కోల్పోయి పూర్తిస్థాయిలో ఇల్లు కోల్పోయిన వారికి కలెక్టర్కు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. పూర్తిగా పరిశీలించి ఎవరిని ఇబ్బందులు పెట్టకుండా ప్రభుత్వ నిబంధన ప్రకారం నష్టపరిహారం అందిస్తామని ఆయన తెలిపారు. 120 మంది డాక్యుమెంట్లను ఆయన పరిశీలించారు ఎవరైనా అభ్యంతరాలు ఉంటే తెలుపుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తాసిల్దార్ నరసింహులు నేషనల్ జాతీయ రహదారి ఏఈ రఘునాథ్ సర్వేర్ కరిముల్లా ఆర్ఐ సమ్మతకల్ బాధితులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా

భగత్‌సింగ్‌కు నివాళి

విశాలాంధ్ర-వేంపల్లె: వేంపల్లెలో కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్‌కు కాంగ్రెస్‌పార్టీ మీడియా ఇన్‌చార్జి తులసిరెడ్డితో పాటు ఆ పార్టీ శ్రేణులు నివాళులు అర్పించారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్క రించుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ అసలైన దేశభక్తుడు సర్దార్ భగత్‌సింగ్ అని కొనియాడారు. జననీ జన్మభూమిచ్చ స్వర్గాదపీ గరియసీ అంటూ దాస్యశృంకలాల నుంచి భరతమాత విముక్తి కోసం ఆయనతో పహద్ రాజగురు, సుఖ్‌దేవ్‌లు 1931 మార్చి 23వ తేదీన లాహెూర్ సెంట్రల్ జైలులో ఉరికంబం ఎక్కి అమరులయ్యారన్నారు. ఈ ముగ్గురి జీవిత చరిత్ర, త్యాగనిరతి, దేశభక్తి నేటి యువతరానికి స్ఫూర్తి కావాలని తులసిరెడ్డి కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, అమర్‌నాథరెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నూతన తెలుగు సంవత్సర కేలండరు ఆవిష్కరణ

విశాలాంధ్ర-వేముల: వేముల ఎంపీడీఓ కార్యాలయంలో శోభకృత్ నామ సంవత్సరం పురస్కరించుకుని హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన తెలుగు సంవత్సర కేలండరును ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి ఆవిష్కరించారు. విజయరాఘరెడ్డి మాట్లాడుతూ శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో , సుఖశాంతులతో జీవించాలని కోరారు. తెలుగు సంవత్సర కేలండరు గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో హిందూ ఉపాధ్యాయ సమితి అధ్యక్షుడు ఎన్ఆర్‌వి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండిక్షేత్రంలో పంచాంగ శ్రవణం

విశాలాంధ్ర-పులివెందుల: చక్రాయపేట మండలం గండి క్షేత్రంలో ఉగాది పర్వదినం పురస్కరించుకుని వేద పండితులు మామిడాల రామ్మోహన్‌శర్మ ఆధ్వర్యంలో పంచంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడి, ప్రసాదం, మజ్జిగను భక్తులకు ఉచితంగా అందజేశారు. అలాగే మధ్యాహ్నం పంచభక్ష పరమాన్నం వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంటు కమిషనరు ఏ ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరిస్వామి, రాజాస్వామి భక్తులు పాల్గొన్నారు.

కన్నుల పండువలా శ్రీ చౌడమ్మ జ్యోతులు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం తెల్లవారుజాము 1 గంట నుండి శ్రీచౌడమ్మ తల్లి జ్యోతుల మహెూత్సవ కార్యక్రమం కన్నుల పండువలా సాగింది. పట్టణంలోని పలు ప్రాంతాల నుండి జ్యోతులతో భక్తులు శ్రీచౌడమ్మ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుమునుపు మంగళవాయిద్యాల మధ్య బాణాసంచా పేలుస్తూ జ్యోతులతో ఊరేగింపు జరిగింది. జ్యోతి రూపంలో శ్రీచౌడమ్మ తల్లిని మోస్తూ తొగట క్షత్రియులు చేసిన విన్యాసాలు పురప్రజలను ఆకట్టుకున్నాయి. ఉదయం అమ్మవారు గ్రామోత్సవం ద్వారా భక్తులకు కనువిందు చేశారు. భక్తులు ఆలయం వద్ద తమ మొక్కుబడులు సమర్పించుకున్నారు. భక్తులతో శ్రీచౌడమ్మ, శ్రీఏరువాకమ్మ ఆలయాలు కిటకిటలాడాయి.

పోషకాహారంపై అవగాహన

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : భారతదేశంలో పోషకాహార లోపం రోజురోజుకూ పెరుగుతోంది. పోషకాహార లోపాన్ని తొలగించేందుకు మహిళలు, పిల్లలకు అవగాహన కల్పించారు. గర్భిణులు పాలిచ్చే స్త్రీలు, 0-6 సంవత్సరాల పిల్లలకు బలహీనంగా ఉన్న టీనేజ్ బాలికలకు కూడా పౌష్టికాహారం సరఫరా చేయబడుతుంది. భారతదేశాన్ని ఆరోగ్యంగా బలంగా మార్చడమే ప్రధాన లక్ష్యం. గౌరవ 33 డివిజన్ కార్పొరేటర్ షేక్ గౌస్ బాషా చాక్లెట్ ఆధ్వర్యంలో బెల్లంమండి 2 అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బెల్లంమండి ప్రజలు, ఉపాధ్యాయులు ప్రమీల, ప్రసన్న, నాగమణి, మనోరంజనమ్మ, రబీయా బస్రీ, మహిళా పోలీస్‌లు సాజిదా, పావని, ఆశా లక్ష్మీదేవి, సంజీవమ్మ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్పీ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కడప క్రైం : పోలీసు శాఖకు వెలకట్టలేని సేవలందించి మరణించిన వారికి జిల్లా పోలీసు శాఖ అండగా ఉంటుందని జిల్లా ఎస్.పి అన్బురాజన్ భరోసా ఇచ్చారు. సిద్దవటం పి.ఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన కె.కొండయ్య సతీమణి కె.సుభాషిణికి కార్పస్ నిధి నుండి మంజూరైన రూ. లక్ష ఆర్థిక సాయాన్ని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందచేశారు. పోలీసు సంక్షేమంలో భాగంగా ఈ మొత్తాన్ని అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వారి కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో డి.పి.ఓ జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వరి పాల్గొన్నారు.

సమాజంలో మార్పునకు ..

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో పోరాడుదాం

సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర

విశాలాంధ్ర-కడప రూరల్ : భారతదేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను పూర్తిగా తీసుకొని విద్యార్థులు, యువత ముందుకెళ్లాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర అన్నారు. సర్దార్ భగత్‌సింగ్ 92 వ వర్ధంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్ కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ భగత్ సింగ్ 1931 మార్చ్ 23న మరణించారు. 1907 సెప్టెంబరులో 28న లాహెూర్ సమీపంలోని బంగా అనే గ్రామంలో కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించారని, జాతీయ భావాలు, పోరాట సాంప్రదాయం కలిగిన కుటుంబం సర్దార్ భగత్ సింగ్ ది అని అన్నారు. బ్రిటిష్ వలసదారుల దోపిడీ పరిపాలనను పారదోలి భారతదేశాన్ని విముక్తి చేయడం కోసం జరిగిన జాతీయ ఉద్యమంలో అనేకమంది బలిదానాలు చేశారని, అందులో విప్లవ విద్యార్థి యువజనులు తమ ప్రాణాలను తృణప్రాయం అర్పించారని, జైళ్లను, లాఠీలను, తూటాలను, ఉరికంబాలను చిరునవ్వులతో ముద్దాడిన సర్దార్ భగత్ సింగ్ విప్లవ ధ్రువతారని కొనియాడారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అంతర్జాతీయ నియమాలను తుంగలో తొక్కి విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవులను ఉరితీసే ముందు ఉరికొయ్యలను సైతం వారు ముద్దాడారని కొనియాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వరుసగా అధికారం చేపట్టి తొమ్మిది సంవత్సరాలు కావస్తుంది. అయినా కూడా సమస్త రంగాలను సంక్షోభంలోకి నెట్టుతూ, ముఖ్యంగా జాతీయ నూతన విద్యా విధానం 2020 పేరుతో విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తూ, కార్పోరేట్ కరణ చేస్తూ రిజర్వేషన్లకు పాతర వేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తుందని సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న నరేంద్ర మోడీ ఇవ్వకపోగా, ఉన్న ప్రభుత్వ రంగ వ్యవస్థలను ప్రైవేటీకరణ చేస్తూ రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తున్నారని, ఇప్పటికైనా భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు పరచాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం హిందూ రాజ్య స్థాపనకు కంకణం కట్టుకుందని దళితులపై, ఆదివాసులపై, మహిళలపై, ముస్లిం మైనార్టీలపై, హిందూ మతోన్మాద దాడులు పెరిగిపోయాయని, కులాలు, మతాలు ప్రాంతాల మధ్య విభజనలు సృష్టిస్తూ తినే తిండిపై, కట్టుకునే బట్టపై ఆంక్షలు విధిస్తున్నారని భారత దేశ సమాజపు మౌలిక అంశాలను నేలమట్టం చేసే బుల్డోజర్ సంస్కృతిని నరేంద్ర మోడీ, అమిత్ షాలు అమలుపరుస్తూ, లౌకిక విలువల్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, కడప నగర ఉపాధ్యక్షులు శివ శంకర్, భగత్ సింగ్ స్టడీ సర్కిల్ నాయకులు సావంత్ సుధాకర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దస్తగిరి, గంగా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కేంద్రంలో, రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఇండియన్ జర్నలిస్టు యూనియన్ పిలుపులో భాగంగా గురువారం 'సేవ్ జర్నలిజం డే) సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేకరులు, మీడియా ప్రతినిధులు సమాజం పట్ల బాధ్యతగా అవినీతిని వెలికి తీసే క్రమంలో అనేక ఇబ్బందులకు లోనైనా కూడా తమ వృత్తిని నిబద్ధతగా చేయడం జరుగుతుందన్నారు. 'సేవ్ జర్నలిజం డే' ను, అంటే మార్చి 23వ తేదీని, స్వాతంత్ర్య సమరయోధుడు, అమరవీరుడు భగత్‌సింగ్ దినంగా జరుపుకుంటున్నా మన్నారు. దేశంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనిశ్చిత మీడియా పరిస్థితి, సమస్యలను ఎత్తిచూపడానికి దేశవ్యాప్తంగా ఐజేయు రాజ్యాంగ సంఘాలు ఈ 'సేవ్ జర్నలిజం' దినోత్సవాన్ని పాటిస్తున్నాయన్నారు. పాలక శక్తుల ఇష్టాయిష్టాలకు లొంగని స్వతంత్ర జర్నలిస్టులు, మీడియా సంస్థల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసహన వైఖరి పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నామన్నారు. తమ డిమాండ్లయిన బడా కార్పొరేట్ సంస్థల బారి నుండి మీడియాను కాపాడాలని, సంపాదకులు మరియు జర్నలిస్టుల స్వతంత్రతను కాపాడాలని, ప్రతీకార రాజకీయాల నుండి ప్రకటనల జారీని తొలగించాలి, సమ సమాజ స్థాపనకు కృషి చేస్తున్న జర్నలిస్టులపై యుఏపీఏ, దేశద్రోహం వంటి క్రూరమైన చట్టాలను ఆపాదించడం ఆపాలి, జర్నలిస్టులు దేశ వ్యతిరేకులుగా పేర్కొనడం మానుకోవాలి, ఐటీ నిబంధనల ముసుగులో డిజిటల్ మీడియాకు సమస్యలు సృష్టించకూడదని, మీడియాకు సంబంధించిన అన్ని అంశాలను అధ్యయనం చేసేందుకు వెంటనే మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలి, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ మీడియా అక్రిడిటేషన్ కమిటీలో అన్ని గుర్తింపు పొందిన జర్నలిస్టు యూనియన్‌ల ప్రాతినిధ్యాన్ని పునరుద్ధరించాలి, జర్నలిస్టులు మరియు మీడియా సంస్థలపై దాడులను ఆపాలి, కేంద్రంలో మరియు రాష్ట్ర స్థాయిలో కూడా జర్నలిస్టుల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి, రైల్వేలో అన్ని రాయితీలను పునరుద్ధరించాలి, అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్‌ను మంజూరు చేయాలి, ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన అన్ని ఇతర సౌకర్యాలను పునరుద్ధరించాలనే తమ డిమాండ్లను పరిశీలించి సానుకూలంగా స్పందించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో చిన్నపత్రికల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెంకటరెడ్డి, జాతీయ సభ్యులు రామాంజనేయరెడ్డి, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు శివరామ్, జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, సర్దార్, నాగరాజు, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి దేవేంద్రాచారి, ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్‌ల అధ్యక్షుడు శ్రీనివాసులు, నగరంలోని జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ పాల్గొన్నారు.

ముస్లిం మతాలకు చిచ్చు పెట్టవద్దు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : పటాన్లు అందరూ సమానులే అని ముస్లిం మైనార్టీ సంఘ సేవకులు సల్లావుద్దీన్ అన్నారు. కడప నగరంలోని రవీంద్ర నగర్ బుఖారియ మస్జిద్‌లో ఆంధ్రప్రదేశ్ సున్ని మాషిఖా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇస్తేక్-బాల్-ఈ రంజాన్ విలాదత్ ఈ గౌస్ అజామ్ అనే కార్యక్రమం జరిగినది. అనంతరం మాట్లాడుతూ రాజకీయ లబ్ది కోసం పరిపాలిస్తున్నారు. అల్లా ముందర ముస్లింలు అందరూ సరి సమానమెన్నారు. ఈ కార్యక్రమంలో నజీర్ అహ్మద్ జిలాని భాష ముస్లిం మత పెద్దలు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీ ముస్లిం రాజకీయ నాయకులు ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

హరిహర ప్రసాద్ నేత్రదానం

విశాలాంధ్ర-పులివెందుల: రాయచోటి పట్టణం లోని బోస్ నగర్ కి చెందిన కుప్పం హరిహర ప్రసాద్ (67 సంవత్సరాలు) బుధవారం రాత్రి మరణించడంతో నేత్ర దానానికి అంగీకరిస్తూ మృతుని భార్య పద్మావతి, కుమార్తె అనీల, లయన్స్ క్లబ్ కొత్తస్ సుదర్శన్‌లు మొబైల్ ద్వారా పులివెందులకి చెందిన స్నేహిత అమృత హస్తం సేవాసమితికి సమాచారం ఇవ్వడం తో నేత్రనిధి టెక్నీషియన్ హరీష్ హుటాహుటిన రాయచోటి లోని మృతుని స్వగృహం నందు పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపినట్లు సేవా సమితి అధ్యక్షుడు రాజు తెలిపారు. రాజు మాట్లాడుతూ ఎంతో మంది అంధత్వంతో బాధపడుతూ నేత్రదానం కోసం ఎదురుచూస్తూ ఉన్నారని, మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేయడం వలన అంధులకు చూపు ఇవ్వడంలో పాటు మరణించిన తరువాత కూడా ఈ ప్రపంచాన్ని చూసే బృహత్కార్యమని ఇది మనిషికి దేవుడిచ్చిన గొప్ప వరమన్నారు. ప్రతి కుటుంబం నేత్రదానంపై అవగాహన కలిగి, నేత్రదానాన్ని ప్రతి ఒక్కరు కుటుంబ సంప్రదాయంగా అలవరచుకోవాలని కోరారు. నేత్రదానానికి అంగీకారం తెలిపి నేత్రదానాన్ని ప్రోత్సాహం అందించిన కుటుంబ సభ్యులను లయన్స్ క్లబ్ కొత్తస్ సుదర్శన్, వెంకటసుబ్బయ్య, సేవాసమితి బృందం సభ్యులు అభినందనలు తెలిపారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం భగత్ సింగ్ 92వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ 23ఏళ్ల వయసులోనే భారతదేశం కోసం ప్రాణత్యాగం చేశారని ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి శరత్ పేర్కొన్నారు. 2008లో ఇండియాటుడే నిర్వహించిన సర్వేలో గొప్ప దేశభక్తుడిగా భగత్‌సింగ్ ఎంపికయ్యారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి లీలాకృష్ణతో పాటు మస్తాన్, లోకేష్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవండి విజయం మీ వైపే

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : విద్యార్థులు విద్యను ఇష్టపడి చదివితే విజయం మీ వైపే ఉంటుందని బాలవికాస్ స్కూల్ గంగయ్య అన్నారు. కడప నగరంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న శ్రీ భాష్యం పదో తరగతి విద్యార్థుల ఫేర్వెల్ పార్టీకి హాజరై ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఉజ్వల భవిష్యత్తు కొరకు కష్టపడి చదవాలని పిలుపునిచ్చారు. పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు భవిష్యత్తులో ఏ ఏ కోర్సుల్లో చేరాలని అంశాల మీద అవగాహన కలిగి ఉండాలన్నారు. గతంలో శ్రీ భాష్యం స్కూల్లో విద్యను అభ్యసించి ఉన్నతమైన చదువులు చదువుతున్నారని కొనియాడారు. గతంలో పిల్లల మాదిరిగానే మీరు కూడా మంచి మార్కులు సాధించాలని ఆయన కోరారు. అనంతరం శ్రీ భాష్యం స్కూల్ కరస్పాండెంట్ వారణాసి నాగ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు పబ్లిక్ పరీక్ష నందు మంచి ఉత్తీర్ణత సాధిస్తూ మా స్కూల్ కు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ స్కూల్ కరెస్పాండెంట్లు పద్మనాభ రెడ్డి, రమణారెడ్డి, రమణ, ప్రముఖ నాయకులు అక్బర్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మానవతా ఆధ్వర్యంలో చలివేంద్రం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : పురపాలికపరిధిలోని మెయిన్ బజారు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారిలో గురువారం మానవతా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమీషనర్ పగడాల జగన్నాథ్ దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పాదాచారులు, ప్రయాణీకుల సౌకర్యార్థం మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఇప్పటికే అనేక ప్రజోపయోగ కార్యక్రమాలను కొనసాగిస్తున్నా మానవతా సంస్థ ప్రతినిధులు అభినందనీయులని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మహ్మద్ ఆలీ, ఏఈ సందీప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, మానవతా ప్రతినిధులు రఘురామిరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, జీరెడ్డి మల్లికార్జునరెడ్డి, సాంబశివారెడ్డి, విజయకుమార్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, రమేష్‌బాబు, రిటైర్డు ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు: తాహసీల్దార్

విశాలాంధ్ర-అట్లూరు : మండలంలోని ప్రభుత్వ స్థలాలను, భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని అట్లూరు తాహసీల్దార్ శ్రీవాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందడంతో తక్షణమే వీఆర్ఓ ప్రశాంతిని తమ కార్యాలయానికి పిలిపించి అనుమతులు లేకుండా ఎవరైనా నిర్మా ణాలు చేపడితే చర్యలు తీసకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తాహ సీల్దార్ శ్రీవాణి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ భూము లు, స్థలాలు పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కబ్జాదారుల నుండి ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు ఖాళీ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే రెవెన్యూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బీజేపీ కక్ష పూరిత రాజకీయాలు మానుకోవాలి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ఎన్నికల సందర్భంలో రాహుల్ గాంధీ చేసిన ప్రసంగాలపై కక్షపూరితంగా వ్యవహరించి, పరువు నష్టం దావాలు వేయడం సరైన చర్య కాదని, కాంగ్రెస్ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాస రావు అన్నారు. సూరత్ కోర్టు రాహుల్ గాంధీకి రెండు సంవత్సరాలు శిక్ష విధిస్తూ నేడు తీర్పు ఇవ్వడంతో, బిజెపి చర్యలు సరైనవి కావన్నారు. రాజకీయంగా రాహుల్ గాంధీ కి వస్తున్న పేరును చూసి ఓర్వలేకనే ఇలాంటి చర్యలకు బిజెపి తెగబడుతుందన్నారు. భారత్ జూడో యాత్రతో రాహుల్ గాంధీకి కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు ప్రజాదరణ విపరీతంగా పెరి గిందన్నారు. 2024 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తప్పుడు కేసులతో రాహుల్ గాంధీని అపఖ్యాతి పాలు చేయాలనుకోవడం బిజెపి దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. కేసులకు కాంగ్రెస్ పార్టీ భయపడదన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో ప్రవేశపెడు తున్న పథకాలను చూసి, కేంద్రంలోని బిజెపి భయపడుతున్నదని అన్నారు. 2024లో కచ్చితంగా రాహుల్ గాంధీనే ఈ దేశానికి ప్రధాని అవుతారన్నారు.

జర్నలిస్టు శ్రీనాథ్ రెడ్డికి ఘన నివాళి

విశాలాంధ్ర-కడప వైవీయూ : విలువలకు పెద్దపీట వేస్తూ పాత్రికేయానికి సరైన అర్థంలా నిలిచిన సీనియర్ పాత్రికేయులు దేవి రెడ్డి శ్రీనాథ్ రెడ్డి మృతి ఆవేదనకు గురిచేసిందని వైవీయూ ఉపకులపతి ఆచార్య జింక రంగ జనార్ధన్, కులసచివులు ఆచార్య వై పి వెంకటసుబ్బయ్య, తెలుగు శాఖ ఆచార్యులు, గజ్జల మల్లారెడ్డి ట్రస్ట్ కన్వీనర్ ఎన్ ఈశ్వర రెడ్డి తెలిపారు. జిల్లాలో పాత్రికేయుడిగా జీవితాన్ని ప్రారంభించి జాతీయ ఆంగ్ల, తెలుగు పత్రికలలో పనిచేసిఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ ఎదిగిన శ్రీనాథ్ రెడ్డి ఆదర్శ భావాలుగల వారని తెలిపారు. అందువల్లే యోగి వేమన విశ్వవిద్యాలయం ద్వారా ప్రముఖ పాత్రికేయులు గజ్జల మల్లారెడ్డి పురస్కారం -2019 ను ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, పూర్వపు ఉప కులపతి ఆచార్య మునగల సూర్య కళావతి, పూర్వపు కులసచివులు ఆచార్య విజయ రాఘవ ప్రసాద్ చేతుల మీదుగా అందజేశామన్నారు. అలానే ఈయన చైర్మన్గా ఉన్నప్పుడే వైవియూతో ప్రెస్ అకాడమీ ఎంఓయు కుదుర్చుకుందన్నారు. కోవిడ్ తీవ్రంగా ఉన్న రోజుల్లో వర్కింగ్ జర్నలిస్టుల నైపుణ్యతను పెంచేందుకు అన్ని జిల్లాల జర్నలిస్టు ఆన్లైన్లో శిక్షణ ఇచ్చిన విషయాన్ని గుర్తుకు తెచ్చారు. నిబద్ధత కలిగిన పాత్రికేయులు శ్రీనాథ్ రెడ్డి మృతి వార్త ఆవేదన గురిచేసిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారు కోరారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి

తహసీల్దార్‌కు జర్నలిస్టుల వినతి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పత్రికా స్వేచ్ఛను, పత్రికా రంగ అస్థిత్వాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రొద్దుటూరు జర్నలిస్టులు తహసీల్దార్ నజీర్‌ఆహ్మద్‌కు వినతిపత్రాన్ని సమర్పిం చారు. గురువారం సేవ్ జర్నలిస్టు డే సందర్భంగా ప్రొద్దుటూరు జర్నలిస్టులు సంయుక్తంగా కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించిన అనంతరం సీనియర్ జర్నలిస్టు సుందర్ రాజు మాట్లాడుతూ ఐజేయూ పిలుపుమేరకు సేవ్ జర్నలిస్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్న వారందరికి వృత్తి భద్రత, వేతన భద్రత హక్కులను కల్పించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

సొంత ఎమ్మెల్యేలు సైతం జగన్ ను నమ్మట్లేదు: టీడీపీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ఎమ్మెల్సీ ఫలితాలలో టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనురాధ 23 ఓట్లతో గెలుపొందడంతో టిడిపి కడప నియోజకవర్గ ఇన్చార్జ్ అమీర్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస హరికృష్ణ గారి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నందు విజయోత్సవ సంబరాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు అర్పించారు. అనంతరం పెద్ద ఎత్తున బాణాసంచ కాల్చి, నాయకులు కార్యకర్తలు సీట్లు పంచుకొని విజయోత్సవ సంబరం చేసుకున్నారు. నిన్న నేడు జరిగిన ఎన్నికలలో టిడిపి ప్రభంజనం చూపిందని రేపు జరగబోయే సార్వత్రిక ఎన్నికలతో వైసిపి ప్రభుత్వానికి ప్రజలు గోరి కట్టడం ఖాయమని, అరాచక ప్రభుత్వ పతనానికి నాందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, ఆలంకంపల్లి మన్మోహన్ గారు పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ జనార్ధన్, నగర అధ్యక్షులు సానుపు రెడ్డి శివ కొండారెడ్డి, 5 డివిజన్ ఇన్చార్జి సురేష్ 15,22 డివిజన్ ఇంచార్జి శ్రీనివాసులు,44 డివిజన్ ఇంచార్జి ,46 డివిజన్ ఇంచార్జి భరత్ కుమార్, డివిజన్ ఇన్చార్జిలు, మాసాపేట శివ ఇతర నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దపీరయ్య స్వామి ఆరాధన మహెూత్సవాలు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: కాలజ్ఞాన కర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వాముల వారి ప్రియ శిష్యుడు అయిన సిద్దయ్య స్వాముల వారి కుమారుడు పెద్దపీరయ్య స్వాములవారి ఆరాధన మహెూత్సవాలను అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ప్రతిరోజు సుప్రభాత సేవలు, అభిషేకాలు, కుంకుమార్చనలతో పాటు గ్రామోత్సవం కార్యక్రమా న్ని సిద్దయ్యస్వాముల వారి మఠాధిపతుల ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు ప్రత్యేకంగా చలువపందిళ్లు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిం చారు. హరికథలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బహుమతులను కూడ అందచేశారు. యువకులకు గుండ్ల ఎత్తే పోటీలు, వృషభరాజములకు మొదటి బహుమతి(బండ లాగుడు పోటీలు) మొదటి బహుమతి రూ.75వేల 16 ముత్యాల పిచ్చిరెడ్డి గారి కుమారుడు బ్రహ్మంగారి మఠం జడ్పీటీసీ(ఏ1 కాంట్రాక్టర్) బహుమతి అందుకున్న శీలం జగన్‌మోహన్ రెడ్డికి అందచేశారు. రెండవ బహుమతి రూ.50వేల 16 సిద్దయ్య గారి మఠం మఠాధిపతులు చిన్న ఓబుల్‌రెడ్డికి అందచేశారు. మూడవ బహుమతి కొనగొండు ఆచారి కొండయ్య వారి కుమారులు రూ.30వేల 16 శ్రీనివాసుల రెడ్డి అందచేశారు. నాలుగవ బహుమతి రూ.15వేల 16 బసిరెడ్డి పుల్లారెడ్డి కుమారులు దుగ్గిరెడ్డి సుదర్శన్‌కు అందచేశారు. అదేవిధంగా చిన్న బండలాగుడు పోటీలో కూడ వారికి బహుమతులను అందచేశారు. మహా ప్రసాద నైవేద్యంతో ఉత్సవాలను ముగిశాయి. ఈ ఉత్సవాలకు ఎస్ఐ విద్యాసాగర్ గట్టి బందోబస్తు ఏర్పాటుచేసి ఉత్సవాలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును ఏర్పాటుచేశారు. భక్తులకు బస్సు సౌకర్యం ఏర్పాటుచేశారు.

విశాలాంధ్ర
అన్నమయ్య జిల్లా



శుభాల వసంతం రంజాన్: ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రంజాన్ మాసం శుభాల వసంతమని వైఎస్ఆర్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు.రంజాన్ ఒక మహత్తర మాసమని ,ఈ పేరు వినగానే మనస్సు భక్తితో,ఆనందంతో పులకరిస్తుందన్నారు .ఈ మాసంలోనే పవిత్ర ఖురాన్ గ్రంధం అవతరించిందని, రోజా (ఉపవాస వ్రతం)ఆరాధనను దైవం ఈ మాసంలోనే నిర్ణయించి నందున ఈ మాసానికి పవిత్రత, గొప్పదనం వచ్చాయన్నారు. నెల రోజుల పాటు భక్తి శ్రద్ధలతో కఠోర ఉపవాసాలు చేయడం మహా పుణ్య కార్యమన్నారు. ఉపవాస దీక్షలుకు, ప్రత్యేక ప్రార్థనలుకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా విద్యుత్, మున్సిపాలిటీ శాఖలు ప్రత్యేక చొరవ చూపాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి ముస్లిం సోదరులుకు రంజాన్ మాసపు ప్రారంభపు శుభాకాంక్షలు తెలిపారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర-చిట్వేలి : గతంలోకన్నా ఈ సంవత్సరం ఎండలు ఎక్కువగా ఉంటాయనీ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఆర్ఓ మురళీకృష్ణ అన్నారు. గురు వారం నాడు మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో గతంలో కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవు తున్నాయనీ ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలనెలా ప్రజలకు అవగాహన కల్పిం చాలని ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో లేక అవసరమైతే మాత్రమే ఇంటినుండి బయటకు రావాలని ఎండ వేడిమి నుండి కాపాడు కునేందుకు గొడుగు లేదా టోపీ లు ధరించాలని సాధ్యమైనంతవరకు ఎక్కువ శాతం మంచి నీరు పానీయాలు త్రాగమని ప్రజలకు సలహాలూసూచన లూ ఇచ్చి ప్రజలకు అవగాహన కల్పించాలని మండలం లోని అధికారులు అయన తెలిపారు.

నేటి నుండి రంజాన్ మాసం ప్రారంభం

విశాలాంధ్ర-పీలేరు: నేటి నుండి రంజాన్ మాసం ప్రారంభమైంది. ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో సాంప్రదాయమైన రీతిలో అలాగే కఠినమైన ఉపవాస దీక్షలో పాల్గొని తమ ఉపవాసాన్ని కఠోరంగా ఉంటూ అల్లాను ధ్యానిస్తూ ఈ రంజాన్ మాసపు ఒక్క ఉపవాసా లతో ముస్లిములు ప్రత్యేక ప్రార్థన చేస్తూ ఉంటారు. అలాగే ఉదయం పూట సహర్ తో పాటు రంజాన్ యొక్క నిర్ణీత సమయంలోపు మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థన నమాజ్ వరకు ఇఫ్తార్ వరకు ముస్లింలు కఠోరమైన ఉపవాస దీక్షలో ఉంటారు నేటి నుండి ప్రారంభం అవుతున్న రంజాన్ మాసంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలతో పాటు రంజాన్ మాసాని పురస్కరించుకొని దానధర్మాల కార్యక్రమాన్ని కూడా చేపడుతారు.

వైయస్సార్ కార్యకర్త మృతదేహానికి నివాళి

విశాలాంధ్ర-కలికిరి: స్థానిక మండలంలోని పతేగడ గ్రామపం చాయతీ కొటాల కు చెందిన వైయస్సార్ కార్యకర్త వాసునూరి బసవరాజు అనారోగ్య కారణంతో మృతి చెందిన సంఘటన తెలుసుకుని ఏపీఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి పార్టీ అన్ని విధాల ఆదుకుం టుందని కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి వి హరి, మైనార్టీ యువ నాయకులు బావాజీ, మూర్తి, వెంకటపతి మునయ్య, సోషల్ మీడియా కన్వీనర్ వీడియో వి భాను ప్రకాష్,తదితరులు పాల్గొన్నారు.

నేటి యువతరానికి ఆదర్శం భగత్ సింగ్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: నేటి యువతరానికి సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వీరులు ఆదర్శమని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, సిపిఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ పేర్కొన్నారు. అమరవీరుల 92 వ వర్ధంతి సందర్భంగా గురువారం సిపిఐ పార్టీ కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వడ్డి జయసింహ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

అనురాధ విజయం చారిత్రాత్మకం

విశాలాంధ్ర -రాజంపేట: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నిక ల్లో పంచుమర్తి అనురాధ గెలుపొందడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో చారిత్రాత్మక విజయమని ఎన్నారై టిడిపి కువైట్ హవల్లి గవర్నరేట్ కోఆర్డినేటర్ ఓలేటి రెడ్డయ్య చౌదరి కొనియాడారు.గురువారం అసెంబ్లీ సాక్షిగా జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్ని కల్లో బడుగు బలహీన వర్గాలకు చెందిన పంచుమర్తి అనురాధ తెలుగు దేశం పార్టీ తరఫున పూర్తిస్థాయి మెజారిటీ లేకపోయి నప్పటికీ వైసీపీ క్రాస్ ఓటింగ్ తో గెలుపొందడం హర్షించదగిన విషయమని వారన్నారు. ఇటీవల జరిగిన పట్టభద్ర ఎమ్మెల్సీ ఎలక్షన్లో ఉత్తరాంధ్ర, పశ్చిమ, తూర్పు రాయలసీమలో ఘోర పరాభవంతో పాటు ఈ ఎన్నిక వైసీపీకి చెంపపెట్టు లాంటిదని వారు ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో జరిగే ఎటువంటి ఎన్నికల్లో అయినా తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగరవేయడం తథ్యమన్నారు.

టీడీపీ శ్రేణుల్లో సంబరాలు

విశాలాంధ్ర-పీలేరు: ఎమ్మెల్సీగా విజయం సాధించిన విజయవాడ మాజీ మేయర్, చేనేత ఆడ పడుచు, తెలుగు దేశం కుటుంబసభ్యురాలు పంచుమర్తి అనూరాధ గెలుపుపై పీలేరు టీడీపీ శ్రేణుల్లో సంబరాలు నెలకొన్నాయి. టీడీపీ నేత,పీలేరు టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ని కలసి ధన్య వాదములు తెలుపుతు సంబరాలు చేసుకున్నారు.

లక్ష్యాల సాధనకు అత్యంత ప్రాధాన్యం: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డిజి) సాధనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరిషా పిఎస్ పేర్కొన్నారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర సచివాల యం నుంచి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్కూల్ ఎడ్యుకేషన్, మహిళా మరియు శిశు సంక్షేమ ప్రభుత్వ పథకాలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, విలేజ్, వార్డు సెక్రటేరియట్, స్పందన గ్రీవెన్స్, గడప గడపకు మన ప్రభుత్వం, వివిధ ప్రభుత్వ పథకాల అమలు పై కలెక్టర్లు, జేసిలతో చీఫ్ సెక్రటరీ డా.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ మినీ విసి హాల్ నుండి కలెక్టర్ గిరీషా పిఎస్, జేసి తమీమ్ అన్సారియా, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకాలు, కార్యక్రమాల ఫలాలను లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో అందేలా చూడటం ద్వారా ఎస్‌డిజి లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణుల్లో రక్త హీనత, పోషకాహార లోపంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు.

చిరంజీవి బ్లడ్ బ్యాంకుకు రక్తదానం

విశాలాంధ్ర-సుండుపల్లె : మండలంలోని సిద్ధారెడ్డి గారిపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సంఘసేవకులు డా.సయ్యద్ అహ్మద్ చిరంజీవి రక్తనిధి కేంద్రం హైదరాబాద్ నందు రక్త కణాలను దానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సయ్యద్ అహ్మద్ మాట్లాడుతూ తను గత 15 ఏళ్ల నుండి ఈ రక్తదాన కార్యక్రమాలను నిర్విరామంగా నిర్వహిస్తున్నానని, తను ఇప్పటివరకు 39సార్లు రక్తం, 3సార్లు రక్తకణాల దానం చేశానని, ప్రత్యక్షంగా పరోక్షంగాను 41వేల మందికి పైగా అవసరార్థులకు రక్తం అందించానని, ఇప్పటివరకు వందకు పైగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి కొన్ని వేల మందికి శాశ్వత రకదాతలుగా తయారు చేశానని ఆయన తెలియజేశారు. యువత రక్తదానం మీద అపోహలు వీడి ముందుకు వచ్చి రక్తదానం చేయాలని దీని మూలంగా రక్త కొరత లేని సమాజం నిర్మించవచ్చని ఆయన తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ హెయిర్ స్టైలిష్ రాజ్ థామస్, దియా హెల్పింగ్ హాండ్స్ చైర్మన్ రాజశేఖర్, మేడిది రావు, టెక్నీషియన్ గీతా రెడ్డిలు పాల్గొన్నారు.

జ్యోతుల కార్యక్రమానికి హాజరైన తులసి రెడ్డి

విశాలాంధ్ర - రామాపురం : మండలంలోని సుద్దమాల పంచాయతీ ఓబుల్‌రెడ్డి గారి పల్లెలోని శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో జరిగిన జ్యోతుల కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. తులసి రెడ్డి హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు కలిసి అమ్మవారి తీర్థప్రసాదాలు పూల హారం ఆయనకు అందజేశారు. ప్రతి ఏడాది ఉగాది రోజున అమ్మవారికి జ్యోతు లు జరుపుకోవడం జరుగుతున్నారా ఏడాది హాజరు కావడం సంతోషం కలుగుతుందని తొగట వీర క్షత్రియ సంఘం నాయకులు తెలిపారు.

టీడీపీలోనే బీసీలకు పెద్ద పేట

విశాలాంధ్ర -రామసముద్రం: తెలుగుదేశం పార్టీలో బీసీలకు పెద్ద పేట ఉంటుందని రామసముద్రంమండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గౌని వారి విజయ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ గా పంచుమర్తి అనురాధ గెలవడం శుభ పరిణామం అని పేర్కొన్నారు వైకాపాలోని కొంతమంది ఎమ్మెల్యేలు ఆత్మ బోధన సారం ఓటు వేయడంతో అనురాధ గెలుపొందిందని తెలిపారు. ఒక బీసీ మహిళకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఎమ్మెల్సీ అవకాశము ఇవ్వడంతో అనురాధ గెలుపు కూడా ప్రభుత్వ వ్యతిరేకతను తెలియపరుస్తుందని చెప్పారు. ఎమ్మెల్యేలలోతీవ్ర అసంపూర్తి నెలకొందని అందుకు ఉదాహరణ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలే నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికే 108 నియోజకవర్గాల పరిధిలో పట్టబద్రుల ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ మూడు ఎమ్మెల్సీ స్థానాలు కైవసం చేస్తుందని చెప్పారు. కార్యకర్తల సమిష్టి కష్టంతోనే తెలుగుదేశం పార్టీ ముందుకు వెళ్తుందని చెప్పారు. రామసముద్రం సర్పంచ్ గౌని వారి కవిత మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో మహిళలకు ఎప్పుడు ఎంతో గౌరవం ఉంటుందని కష్టపడ్డ వారికి ఫలితం ఉంటుందని అందుకు ఉదాహరణ పంచుమర్తి అనురాధేనని తెలిపారు.

మాలల సింహగర్జనకు తరలి రండి

విశాలాంధ్ర-నందలూరు :: ఈనెల 26వ తేదీన జరగనున్న మాలల సింహ గర్జన రావాలని పిలుపునిచ్చారు. బుధవారం మాలల జేఏసీ ఆధ్వర్యంలో నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ను కలిసి పెద్ద ఎత్తున సింహా గర్జనకు తరలిరావాలని ఆహ్వాన పత్రం అందజేశారు. 26 తేదీన రాజంపేటలోని ఎస్ఆర్ కళ్యాణమండపంలో నిర్వహించే మాలల సింహగర్జనకు అన్నమయ్య జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గ మండలాల నుండి పెద్ద ఎత్తున మాలలు తరలివచ్చేం దుకు ప్రతి గ్రామం తిరిగి అందరిని సమాయత్తం చేస్తున్నామని మా లల జేఏసీ నాయకులు లింగం సంజీవ. పెను బల నాగ సుబ్బయ్య కాకిచంద్ర సుబ్బ నరసయ్య సుధాకర్ తదితరులు పేర్కొన్నారు. అందులో భాగంగానే అందరికీ ఆహ్వాన పత్రం అందజేస్తున్నామని వారు అన్నారు.

భగత్ సింగ్ స్పూర్తితో పోరాడుదాం: సీపీఐ

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి: భారతదేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన సర్దార్ భగత్ సింగ్ ఆశ యాలను పూర్తిగా తీసుకొని యువత ముందుకెళ్లాలని సిపిఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. సర్దార్ భగత్ సింగ్ 92 వ వర్ధంతి సందర్భంగా స్థానిక విశ్వ భారతి స్కూల్ లో భగత్ సింగ్ చిత్రపటానికి స్కూల్ కరస్పాండెంట్ రఘునాథరాజు శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అంతర్జాతీయ నియమాలను తుంగలో తొక్కి విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవులను ఉరితీసే ముందు ఉరికొయ్యలను సైతం వారు ముద్దాడారని కొనియాడారు. వారి అమృత్వానికి నేటికీ 92 ఏళ్ళు నిండాయని వారు కోరుకున్న సమాజం నేటికి సిద్ధించలేదని అనేక సామ్రాజ్యవాద దేశాలు నేడు మన దేశాన్ని దోచుకుంటున్నాయని, దోపిడీ, పీడన లేని సమాజం కోసం విద్యార్థి, యువజనులు మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు ఈ కార్యక్రమంలో యువజన నాయకులు రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

4న ఎస్టీ సాధనే లక్ష్యంగా డిల్లీలో రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర- మదనపల్లి : దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాలలో కురబలు ఎస్టీ జాబితాలో కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్‌లో బిసిలుగానే మిగిలిపోయారని, కురబల ఎస్టీ సాధనే లక్ష్యంగా పని చేస్తామని కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు ప్రకటించారు. గురువారం జబ్బల శ్రీనివాసులు స్వగృహంలో నందు ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కురబ సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ ఏప్రిల్ నెల 4 వ తేది ఆంధ్ర భవన్ నందు కురబ, కురుమల ఎస్టీ సాధనే ధ్యేయంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా కురబలు పలు రకాల పేర్లతో పిలువడం జరుగుతోంది. గొర్రెల పెంపకం వృత్తిగా ఎంచుకుని జీవనం సాగిస్తు న్నారు. అయితే సామాజిక, రాజకీయ, విద్య, ఆర్థికంగా ఎంతో వెనుకబడిన కురబలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి ఎన్నో దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా ఫలితం లేదని వాపోయారు. ఎస్టీ సాధన కోసం చేసే ఈ పోరాటంలో కురబ కులస్తులు కలసి రావాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 4 వ తేది నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి మేధావులు, ఉద్యోగులు, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కురబ కుల పెద్దలు హజరు కావాలని కోరారు.

ఆదమరిస్తే అంతే..!!
రహదారిపై గోతులతో వాహనదారులు బెంబేలు

విశాలాంధ్ర- గాలివీడు: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గోతులతో వాహన దారులు బెంబేలెత్తి పోతు న్నారు.కదిరి- రాయ చోటి మార్గంలో హైస్కూల్ వద్ద నడిరోడ్డుపై ఒక అడుగు పొడ వు గల గుండ్రని ఇనుప రేకును అలాగే వదిలేసి రోడ్డు పనులు పూర్తి చేశారు.దీంతో ఏమాత్రం ఏమరుపాటుతో వున్నా వాహనదారులు ప్రమాదాల బారిన పడకతప్పదని పలువురు హెచ్చరిస్తున్నారు. అలాగే గేటు రాయచోటి మార్గం ఉర్దూ పాఠశాల ఎదురుగా ప్రధాన రహదారిలో తూము కుంగిపోవడంతో పెద్ద గొయ్యి ఏర్పడింది.గత కొన్ని రోజులుగా ఎలాంటి మరమ్మతులకు నోచుకోక ఆగోతుల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వెంటనే ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రహదారిపై గోతులు మరమ్మతులు చేపట్టేలా సత్వర చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేటి నుంచి రంజాన్ పండుగ ఉపవాసాలు దీక్షలు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రంజాన్ పండుగలో ప్రతి ముస్లిం జీవన విధానాన్ని ప్రభావితం చేసే పవిత్ర మాసం ఓవైపు భక్తి భావం మరోవైపు శాంతి సోదర భావం ఎడాదిలో అతిపెద్ద పర్వదినమైన ఈ ఈద్ కు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. ఈ నెలలో అల్లాహ్ నుంచి క్షమాపణ పొందితే పాప ప్రక్షాళన జరుగుతుందని వారి విశ్వాసం. నియోజకవర్గంలో గణనీయంగా ముస్లింలు ఉండడంతో చిట్వేలి ఓబులవారిపల్లి పుల్లంపేట పెనగలూరు కోడూరు తదితర ప్రాంతాలలో పండుగ కళ దీక్షల హడావుడి కన్పిస్తోంది. ఈ పవిత్ర మాసంలో రోజు ఉపవాసాలతోపాటు ఖురాన్ పఠనం, నమాజ్, జకాత్ ఫిత్రా ఇవ్వడం అత్యంత ముఖ్యమైనవి.ఇందులో ఏ ఒక్కటి ఆచరించకున్నా రంజాన్ పండుగలో ఈద్గాలో చేసే ప్రార్ధనలకు సార్ధకత చేకూరదు.ఈ మాసంలో దివ్య ఖురాన్ అవతరించిందని ముస్లింల నమ్మకం.నెల రోజుల పాటు సాగే కఠోర ఉపవాస దీక్షలను ముస్లింలందరూ ఆచరిస్తారు.ఈ నెలలో చేసే మంచి పనులు,కార్యాలకు మామూలు రోజుల్లో కన్నా 70 రెట్లు అధికంగా ఫలితం లభిస్తుందని విశ్వాసం.చెడు వీడి మంచిని స్వాగతించేందుకు ఈ నెల రోజులు మంచి అవకాశంగా వారు భావిస్తారు.నెలవంక కనిపించిన దగ్గర నుంచి ఉపవాస దీక్షలు చేపడుతారు.ప్రతిరోజు సూర్యోదయానికి ముందు సహర్ తో ఉపవాస దీక్ష ప్రక్రియ ప్రారంభమై సూర్యాస్తమయంలో ఇఫ్తార్ తో దీక్ష ముగుస్తుంది.ఈ మధ్య సమయంలో మంచి నీళ్ళతో పాటు ఎటువంటి అన్న పానీయాలు తీసుకోరు.కనీసం ఉమ్మి కూడ మింగకూడదు ఇస్లాం మతంలో నిషేధించన దురవ్యసనాలకు దూరంగా ఉంటారు.7 సంవత్సరాలు వయస్సు ఉన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు లింగభేదం లేకుండా ఉపవాసాలు ఉంటారు. దీక్షల్లో ఉన్న ప్రతి ఒక్కరు చెడుకు దూరంగా ఉంటూ ఖురాన్ పఠనంతో పాటు అయిదు సార్లు విధిగా నమాజ్ చేసి ఆధ్యాత్మికాన్ని గడుపుతారు.

స్వచ్ఛమైన పొట్టేలు మాంస విక్రయంలో షాజహాన్ భేష్

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు పట్టణం లోని గత 40 సంవత్సరాలుగా పంచాయతీ కార్యాలయం సమీపం లోని అంబేద్కర్ సర్కిల్ ఎదురుగా షేక్ షాజహాన్ అనే అతను స్వచ్ఛమైన పొట్టేలు మాంస విక్ర యాలు జరుపుతున్నారు. మాంస ప్రియుల కు షాజహాన్ దుకాణం వద్ద బారులు తీరుతారు. మరి ఆదివారం వచ్చిందంటే పట్టణ వాసులు దుకాణం వద్ద రద్దీగానే ఉంటుంది.ఈ నేపథ్యంలో షాజహాన్ మాట్లాడుతూ తమ తాతల కాలం నుండి కూడా పీలేరు పట్టణంలో పొట్టేలు మాంస విక్రయాలు జరుపుతున్నామని అలాగే నేటి నుండి రంజాన్ మాసం పురస్కరించుకొని ప్రతిరోజు వైస్సార్ జిల్లాలోని రామాపురం, తెలంగాణ రాష్ట్రానికి చెందిన మేలు రకపు పొట్టేళు ,ఒంగోలు తదితర ప్రాంతాల నుండి తెచ్చే పొట్టేళ్ల ద్వారా ముస్లింలకు మరియు అలాగే మాంస ప్రియులకు అందరికీ అందుబాటులో విక్రయాలు జరుపుతామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. షాజహాన్ తో పాటు మున్నా కూడా పాల్గొన్నారు.

అనురాధ విజయం చారిత్రాత్మకం

విశాలాంధ్ర-నందలూరు :: గురువారం జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పంచుమర్తి అనురాధ గెలుపొందడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో చారిత్రాత్మక విజయమని తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ స్టేట్ సెక్రటరీ, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ కొనియాడారు. గురువారం అసెంబ్లీ సాక్షిగా జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలకు చెందిన పంచుమర్తి అనురాధ తెలుగుదేశం పార్టీ తరఫున పూర్తిస్థాయి మెజారిటీ లేకపోయినప్పటికీ వైసీపీ క్రాస్ ఓటింగ్‌తో గెలుపొందడం హర్షించదగిన విషయమని వారన్నారు. మొన్న జరిగిన పట్టభద్ర ఎమ్మెల్సీ ఎలక్షన్లో ఉత్తరాంధ్ర, పశ్చిమ, తూర్పు రాయలసీమలో ఘోర పరాభవంతో పాటు ఈ ఎన్నిక వైసీపీకి చెప్పు దెబ్బలాంటిమని వారు ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో జరిగే ఎటువంటి ఎన్నికల్లో అయినా తెలుగుదేశం పార్టీ విజయకేతన ఎగరవేయడం ఖాయమని వారు ధీమా మా వ్యక్తం చేశారు.

క్రీడలలో ప్రతిభ చాటిన ఏఐటీఎస్ విద్యార్థులు

విశాలాంధ్ర - రాజంపేట: అన్న మాచార్య ఇంజనీ రింగ్ కళాశాల రాజంపేటలో విద్యను అభ్యసిస్తు న్న విద్యార్థులు వివిధ క్రీడలలో పాల్గొని ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని ఆదిశంకరా ఇంజనీరింగ్ కళాశాల నందు నిర్వహించిన జేఎన్టీయూఏ-11 క్రీడా పోటీలలో బాల్ బ్యాడ్మిటన్ నందు ద్వితీయ బహుమతిని సాధించిన క్రీడాకారులను, అలాగే కడప జిల్లా ప్రొద్దుటూరులోని వాగ్దేవి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సస్ ఇన్నైటిస్ -2కే23 నందు క్రికెట్ క్రీడలో పాల్గొని ప్రథమ బహుమతి పొందిన, కబడీ మెన్, ఇమెన్ క్రీడలలో ద్వితీయ బహుమతిని, అలాగే వాలీబాల్ నందు ద్వితీయ బహుమతిని సాధించిన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడలలో కూడా రాణించడం చాలా ముఖ్యమని, ప్రస్తుత పరిస్థితులలో క్రీడలకు కూడా మంచి భవిష్యత్తు ఉందని, కావున విద్యార్థులు కళాశాల అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యలో, క్రీడలలో బాగా రాణించి తల్లిదండ్రులకు, కళాశా లకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కళా శాల విద్యార్థుల సౌకర్యార్థం కళాశాలలో ఫెన్సింగ్, ఫ్లెడ్ లైట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం కళా శాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి కోసం తమ కళాశాలలో అన్ని వసతులను ఏర్పాటు చేస్తున్నామని, కావున విద్యార్థులు తమ కళాశాలలోని వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగముని, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడుదాం

విశాలాంధ్ర - రాజంపేట: భారత దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను పూర్తిగా తీసుకొని విద్యార్థి యువత ముందుకెళ్లాలని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి శివరామ కృష్ణదేవరా అన్నారు. సర్దార్ భగత్ సింగ్ 92 వ వర్ధంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాజంపేట నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో గురువారం ఉదయం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయం లో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలేసి ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తామని భగత్ సింగ్‌కు నివాళులర్పించారు..ఈ కార్యక్రమంలో ఏఐటియుసి పట్టణ కార్యదర్శి సికిందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, నియోజకవర్గ కార్యదర్శి ఎస్ .మహమ్మద్, నాయకులు శివ అరుణ్, నరసింహ. కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్సీల విజయం వైసీపీకి చెంప దెబ్బ

విశాలాంధ్ర-పీలేరు: ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో తెదేపా అభ్యర్థులు ఎ ముఖ్యంగా పట్ట భద్రుల ఎమ్మెల్సీగా పోటీచేసిన శ్రీకాంత్ అత్యధిక మెజారిటీతో గెలుపొందడం చూస్తే 2024లో జరిగే ఎన్నికలలో తెదేపా విజయకేతనం ఎగుర వేయడం అక్షర సత్యం అని తెదేపా నాయకులు జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పులి సత్యనారా యణరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడు తూ యువ గళం పాదయాత్రలో జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్తో పాటు పీలేరు నియోజకవర్గ తెదేపా ఇన్చార్జి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి మరోసారి ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది. దీంతో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలతో పాటు విద్యావంతులు పట్టభద్రులు మహిళలు తెదేపా పై మొగ్గుచూపి ఎమ్మెల్సీ అభ్యర్తులను అత్యధిక మెజారిటీతో గెలిపించడం పార్టీకి శుభసూచకం అని అన్నారు.

షార్ట్ ఫిల్మ్ పోటీలలో మిట్స్ విద్యార్థులకు మొదటి బహుమతి

విశాలాంధ్ర- మదనపల్లి: కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువ రాజ్ తెలిపారు. బి.టెక్ చదువుతు న్న బాషా, సద్దాం, నిరంజన్, సుబ్బాన్, నందిని, శ్రీకాంత్, మెకానికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అమృత పాండా మరియు జయప్రకాశ్ లు రోడ్డు ప్రమాదాల గురుంచి అవగాహన కొరకై "వేగం" అను షార్ట్ మూవీ ని తీసి, దానిని ఈ పోటీలో ప్రదర్శిం చినారు. ఈ ఫిలిం చూసిన ప్రతి ఒక్కరిని కలిచివేసిందని, ఇందులో అతి వేగం వల్ల నష్టపోయిన ఒక కుటుంబం పడే వేదనను విద్యా ర్థులు కళ్ళకు కట్టినట్లు చూపించారని ఆయన అన్నారు. ఈ షార్ట్ ఫిలిం కు జాతీయ స్థాయి లో మొదటి బహుమతి లభించిందని, 500 నగదు బహుమతి తో పాటు ప్రశంసా పత్రాలు ను అందజేసి నట్లు ఆయన అన్నారు. గెలుపొందిన విద్యార్థులను కళాశాల కరె స్పాండెట్ డాక్టర్. యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్ట ర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, ఫిలిం మేకర్స్ క్లబ్ ఇంచార్జి రియాజ్ అలీ తదితరులు అభినందనలు తేలియాజేశారు.

25న కూరగాయల, పశువుల సంత వేలంపాట

విశాలాంధ్ర - సుండుపల్లి : మండల కేంద్రంలో ప్రతి సోమవారం జరిగే కూరగాయల వారపు సంతతో పాటు బుధవారం జరిగే పశువుల సంత వేలం పాట కార్యక్రమాన్ని ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ రామచంద్రారెడ్డి తెలిపారు. కూరగాయల సంతకు డిపాజిట్ 70000, పశువుల సంతకు 25000, ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల లోపల డిడి గాని నగదు గాని కార్యదర్శి సురేష్ బాబు దగ్గర చెల్లిం చాలని తెలిపారు. కూరగాయల మార్కెట్ కు టెండర్ ఫారం 500 రూపాయలు పశువుల సంతకు 300 రూపాయలు చెల్లించా లని టెండర్ ఫారం చెల్లించిన డబ్బులు తిరిగి వాపసు ఇవ్వబడు దన్నారు. వేలంపాట పాడిన వారు ఖరారైన పాటకు ఐదు శాతం స్టాంప్ డ్యూటీ అదనంగా చెల్లించి అగ్రిమెంట్ పొందాలన్నారు. అగ్రిమెంట్ అయిన తర్వాత ఏప్రిల్ 23 సంవత్సరం నుండి మార్చి 31, 2024 వరకు రుసుముల వసూలు చేసుకునే హక్కులు కల్పిస్తా రని తెలిపారు. డిపాజిట్ మొత్తము రెండు రోజుల్లో చెల్లించకపోతే దండుగా పద్దు కింద జమ చేసి ఎట్టి పరిస్థితుల్లో వాపుసు ఇవ్వకూడ దనితెలిపారు. ఆసక్తి గలవారు సంత వేలంపాటలో పాల్గొనాలన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

విశాలాంధ్ర- సుండుపల్లె : మండల పరిధిలోని తిమ్మ సముద్రం పంచాయతీ రెడ్డెం పల్లె వద్ద కంపచెట్లలో పేకాట ఆడుతున్న నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు సుండుపల్లె ఎస్సై రామకృష్ణ తెలిపారు. వారి వద్ద నుండి 9080 రూపాయలను స్వాధీనం కొన్ని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపా రు. వారు మాట్లాడుతూ జూదం గ్యాంబ్లింగ్ బెట్టింగ్ వంటి అసాంఘిక చర్యలు చేస్తే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి తాపాన్ని తట్టుకునేలా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర -కలికిరి(పీలేరు): స్థానిక మండల అభివృద్ధి కార్యాలయం నందు ఎంపీపీ వేంపల్లి నూర్జహాన్ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో వేసవి తాపంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వేంపల్లి నూర్జహాన్ మాట్లాడుతూ వేసవి తాపాన్ని తట్టుకునే విధంగా కలికిరి పట్టణం నందు మరియు గ్రామస్థాయిలో సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలో ప్రతి చిరు వ్యాపారస్తులు పెట్రోల్ బంకు యాజమాన్యం ప్రతి ఒక్కరు కూడా నీటిని ఉచితంగా కస్టమర్లకు అందజేయాలని తెలిపారు. గ్రామ హెడ్ క్వార్టర్ నందు మరియు కలికిరి పట్టణ నందు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, మరియు పంచాయతీ సర్పంచులు ఎక్కడైనా తాగునీటి బోరు రిపేర్ కి వస్తే వెంటనే స్పందించి వాటిని పరిష్కారం చేయాలని వేసవి తాపాన్ని తట్టుకునే విధంగా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకొని ముందు ముందస్తు జాగ్రత్తలు పాటించి ఏ ఒక్కరికి సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి అధికారి పైన ఉందని సంబంధిత శాఖ వారు అనగా వైద్యశాఖ, గ్రామపంచాయతీ సర్పంచులు మరియు పట్టణం నందు చిరు వ్యాపారస్తులు సరఫరా చేయాల్సిన బాధ్యత ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి గంగయ్య, తాసిల్దార్ భాగ్యలత జడ్పిటిసి కాకర్ల పద్మజాల్లోకి వర్ధన్, మండల స్థాయి అధికారులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న రామచంద్ర యాదవ్

విశాలాంధ్ర- మదనపల్లి రూరల్: చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ సభ్యులు, శ్రీకృష్ణ దేవాలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు బుధవారం రాత్రి మదనపల్లి కి విచ్చేసారు..అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.. జడ్పీ హై స్కూల్ వద్ద పాలరమేష్ యాదవ్ ,ఉత్తన్నల ఆధ్వర్యంలో రామచంద్ర యాదవ్ అభిమానులు, యువసేన సభ్యులు రామచంద్ర యాదవ్ కు పూల తో ఘన స్వాగతం పలికారు..అక్కడి నుండి గోళ్ళ పల్లి క్రాస్ ,రామారావు కాలనీ,మీదుగా చౌడేశ్వరి దేవి ఆలయం వద్దకు వెళ్లారు.. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి ఆలయం నందు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు..అనంతరం ఆయన కు తీర్థ ప్రసాదాలు అందజేశారు.. ఆలయ కమిటీ సభ్యులచే సన్మానించారు.. అక్కడి నుండి అనపగుట్ట లోని శ్రీకృష్ణ దేవాలయం నందు ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని శ్రీకృష్ణుడు ని దర్శించుకున్నారు.. దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.. శ్రీకృష్ణ దేవాలయానికి రామచంద్ర యాదవ్ అందించిన ఆర్థిక సహకారం ఎప్పటికి మరవదని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు..రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ ప్రజలందరికీ శోబ్ కృత ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ పర్వదినాన చౌడేశ్వరి దేవి, శ్రీకృష్ణుడు ని దర్శించుకోవడం పై హర్షం వ్యక్తం చేశారు.. ఈ ఉగాది తో ప్రజలకు అష్ట ఐశ్వర్యాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాలరమేష్ యాదవ్, ఉత్తన్న,ఓర్సు వీర భాస్కర్, వంశీబొగ్గు భాస్కర్, రాజు , శ్యాము,ఆనంద్,హరి లతో పాటు రామచంద్ర యువసేన సభ్యులు, ఆయన అభిమానులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో నూతన బోర్లు ఏర్పాటు

విశాలాంధ్ర-నందలూరు : 10 లక్షల రూపాయలతో జగనన్న కాలనీలో నూతన బోర్లు ఏర్పాటు చేయడం జరిగింది. బుధవారం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని నారాయణ రాజుపేట జగనన్న కాలనీలో నూతన బోర్లు కు సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జంబు సూర్యనారాయణ మాట్లాడుతూ రాజంపేట శాసన సభ్యులు మేడా మల్లికార్జు న రెడ్డి . ఎంపీపీ మేడ విజయభాస్కర్ రెడ్డి ల చొరవతో జగనన్న నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకం కింద పది లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులను కలెక్టర్ ద్వారా సంబంధిత కాంట్రాక్టర్లకు అందజేయడం జరుగుతుందన్నారు. నారాయణరాజుపేట జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేందుకు ఈ నిధులు విడుదల చేయడం జరిగిందని అన్నారు. 10 లక్షల రూపాయలతో రెండు నూతన బోర్లు మంచినీటి పైపులైన్లు ట్యాంకుల ద్వారా గృహ నిర్మాణాలకు లకు నీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేసి పూర్తిస్థాయిలో నీటిని అందజేయడం జరుగుతుందన్నారు.. ప్రస్తుతం నూతన విద్యుత్ లైన్ పనులు కూడా ప్రారంభమయ్యాయని త్వరగా అవి కూడా పూర్తి అవుతాయని తద్వారా అందరికీ విద్యుత్ సౌకర్యం కూడా అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. జగనన్న కాలనీలో ఇంటి స్థలం పొందిన వారు త్వరగా ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకేపాటి రమేష్ రెడ్డి మట్టి బాబు శిరీషాల నాగేంద్ర తుమ్మల శివకుమార్ పొంబాల శివ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం మంచాలమ్మ తల్లి

విశాలాంధ్ర-రామాపురం : కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం అంచాలమ్మ తల్లి అని మంచాలమ్మ తల్లి దేవస్థానం కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని రాచపల్లి గ్రామం గంగనేరు సమీపంలో వెలసిన మంచాలమ్మ తల్లి తిరుణాల మహోత్సవం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మంచాలమ్మ జాతర ప్రతి సంవత్సరము చైత్ర శుద్ధ విదియ ప్రారంభమై తదియతో ముగుస్తుంది. ఈ మంచాలమ్మ తల్లి రాచపల్లె గ్రామం కొవ్వూరు వాండ్ల పల్లెకు చెందిన కొవ్వూరు ఆడబిడ్డగా ఎన్నో మహిమాన్వితమైన ఆడబిడ్డగా భావించి అమ్మవారిని గ్రామములోని గంగనేరు కొవ్వూరు వానపల్లి రాచపల్లి గంగనేరు వద్దేపల్లి రాళ్లపల్లిల మీదుగా ఊరేగింపు నిర్వహించి మంచాలమ్మ తల్లిని దేవస్థానానికి తీసుకుని వెళ్తారు మంచాలమ్మ తల్లి కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా భావించి ఊరేగింపులో భాగంగా ప్రతి కుటుంబము అమ్మవారికి ప్రతిఫలంగా బాణాలు ముక్కుబడులను చెల్లించి తదనంతరం మంచాలమ్మ పూజలు నిర్వహించి జాతరను ప్రారంభిస్తారు. ఈ జాతర మహోత్సవానికి చుట్టుపక్కల జిల్లాల నుంచి ప్రజలు తండోపతండాలుగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు. ప్రజల కోరిన కోర్కెలు బదులుగా అమ్మవారికి చాందిని బండ్లు బాణాసంచా చెక్కభజనలు కోలాటాలు తదితర కార్యక్రమాలలో నిర్వహిస్తారు. తిరుణాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున వెళ్లి తిలకిస్తారు.

భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలి

న్యాయ విద్యార్థి సంఘం నాయకుడు జి.నాగరాజు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: షహీద్ భగత్‌సింగ్‌కు భారతరత్న అవార్డు ప్రకటించాలని న్యాయ విద్యార్థి సంఘం నాయకుడు గంజికుంట నాగరాజు డిమాండ్‌చేశారు. పట్టణంలోని స్థానిక భాష్యం హైస్కూల్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మార్చి 23 భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు అమరులైన రోజు అని, మన దేశాన్ని రాజ్యాంగాన్ని మతోన్మాద శక్తుల దాడుల నుండి పరిరక్షించుకుని సమైక్య ఆధునిక భారతాన్ని నిర్మించుకోవడానికి మనమంతా కలిసికట్టుగా కదలాలని అన్నారు. ఆధునిక సమైక భారతదేశాన్ని నిర్మించుకునే కృషికి బీజం వేసినారని, భారత జాతీయోద్యమంలో ఒక పెద్ద మధనం జరుగుతున్న కాలమది 1920-21లో సహాయ నిరాకరణోద్యమానికి గాంధీజి పిలుపునిచ్చారని, ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా సాగుతున్న కాలంలోనే చౌరి చౌరా ఘటన జరిగిందని ఈ ఘటనతో గాంధీజి భావి పాలకవర్గాలు ఒక్కసారి ఉలిక్కిపడి అప్రమత్తం అయ్యారు. భాష్యం విద్యాసంస్థల ప్రిన్సిపల్ ఎస్.రాజేశ్వరి దేవి మాట్లాడుతూ ప్రస్తుతం ఒకవైపు సిఏఏ, ఎన్‌సీఏ, ఎన్ఆర్‌ఈసీకి వ్యతిరేకంగా మరింత తోలుగా, విస్తృతంగా ప్రతిఘటన పెరుగుతుంటే ఇంకో వైపు మోడి ప్రభుత్వం అధిక శాతం ప్రజలకష్టాలను ఇబ్బడి ముబ్బడి చేసే విధంగా, దోపిడీని తీవ్రతరం విధానాలను అమలుచేస్తోందని అన్నారు. కార్మిక సంస్కరణ పేరుతో శ్రామిక ప్రజల హక్కులపై దాడి జరుగుతోందని, ప్రజాతంత్ర హక్కులను, పౌర హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగాదేవి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, సీనియర్ అధ్యాపకులు రమణ, కార్యకర్తలు భానుప్రకాష్, శ్రీకాంత్‌తో పాటు భాష్యం విద్యాసంస్థల అధ్యాపక బృందంతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రీ సర్వే పనులను త్వరగా పూర్తి చేయాలి

- గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను వేగవంతం చేయండి

- కలెక్టర్ గిరీష పీఎస్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: గ్రామా ల్లో రీ సర్వే పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష పీఎస్ అధికారులను ఆదేశించారు.గురువారం విజయవాడ సిసిఎల్ఏ కార్యాలయం నుండి రీసర్వే పురోగతి పై కలెక్టర్ లు, జేసిలతో సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఆర్ఓ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి జయారాజ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రీసర్వే పనులన్నీ సకాలంలో పూర్తిచేయలని సూచించారు. హద్దురాల నాటి ప్రక్రియ, గ్రౌండ్ ట్రూతింగ్, డ్రోన్ ఫ్లయింగ్ ప్రక్రియలను వేగవంతం చేయాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడిని కలెక్టర్ ఆదేశించారు.

యువత భగత్ సింగ్ అడుగుజాడల్లో నడవాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: యువత అంతా భగత్ సింగ్ అడుగుజాడల్లో నడవాలని ఐఎఫ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శెట్టిపల్లి సాయికుమార్ పేర్కొన్నారు. విప్లవ వీరుడు ఆదర్శమూర్తి భగత్ సింగ్ 92వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఒకేషనల్ జూనియర్ కాలేజ్ లో ఐఎఫ్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి ఐఎఫ్ఎస్ నాయకులు పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ కల్పన మాట్లాడుతూ.. భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి భారత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన భారతరత్నాలు సర్దార్ భగత్ సింగ్ అని కొనియాడారు. స్వాతంత్ర సంగ్రామంలో వీరోచితమైన పోరాటాల నిర్వహించారన్నారు. భారత యువత అంతా ఆదర్శ ప్రాయంగా భగత్ సింగ్ అర్గజాడల్లో నడవాలని వారు పిలుపునిచ్చారు.

అలంకారప్రాయంగా మంచినీటి ట్యాంక్

విశాలాంధ్ర-గాలివీడు: మండలకేంద్రంలోని స్థానిక హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన మంచి నీటి ట్యాంక్ అలంకారప్రాయంగా మారింది. ప్రభుత్వం త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం లక్షల రూపాయలు వెచ్చించి నీటి పథకాలను అందుబాటులోకి తెస్తుంటే వాటిని వినియోగంలోకి తేవడంలో మాత్రం అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడు తోంది. గాలివీడు పట్టణ పరిధిలో శెట్టివారిపల్లెకు సంబం ధించిన మంచి నీటి ట్యాంక్ నూతనంగా నిర్మించినప్పటికీ వినియో గంలోకి మాత్రం తీసుకురావడం లేదని చుట్టుప్రక్కల ప్రజలు ఆరోపిస్తున్నారు.గుత్తేదారు బిల్లుల చెల్లింపులో జాప్యమా?వాటర్ గ్రిడ్ లో లోపమా? లేక అధికారుల అలసత్వమా? తెలీదుగానీ వెరసి మంచి నీటి ట్యాంక్ మాత్రం దిష్టి బొమ్మలా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఓ వైపు వేసవి వచ్చేస్తోంది నీటి ఎద్దడి ముంచుకొస్తోంది.ఇలాంటి తరుణంలో అందుబాటులో వున్న నీటి వనరులను సక్రమంగా వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతీ విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలి

డైట్ ప్రిన్సిపల్ శివభాస్కర్

విశాలాంధ్ర-గాలివీడు: ప్రతీ విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలని రాయ చోటి డైట్ కళాశాల ప్రిన్సిపల్ మునగ శివభాస్కర్ పేర్కొన్నారు. గురువారం గాలివీడులోని స్థానిక గౌతమ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పది విద్యార్థుల వీడుకోలు సమావేశానికి ముఖ్య అతిధిగా ఆయన హాజరయ్యారు. అనంతరం వారు మాట్లా డుతూ పది పరీక్ష లకు హాజరయ్యే విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా ప్రశాంత వాతా వరణంలో సన్నద్ధం కావాలని సూచించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం షింటో, థామస్ లు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రు లకు,పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ బినయ్ ఫ్రాంసిస్, ఉపాధ్యా యులు శ్రీనువాసులు, సురేష్, అక్తర్,హేమలత, శ్రీనువాసులు, అంబరీష్, తదితరులు పాల్గొన్నారు.

పత్రికా విలేకరుల సేవ అభినందనీయం: తహశీల్దారు

విశాలాంధ్ర - కమలాపురం : సమాజంలో ప్రభుత్వానికి అధికారు లకు ప్రజలకు వారధిగా అనునిత్యం ప్రజా సేవ చేస్తున్న పత్రికా విలేక రుల సేవలు అభినందనీయమని కమలాపురం తహశీల్దార్ సూర్య నారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జాతీయ సేవ్ జర్నలిస్ట్ డే పురస్కరించుకొని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో పత్రికా విలేకరుల ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ సూర్యనారాయణ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంతరం ఎంతో అంకితభావంతో ప్రజా సమస్యలపై పోరాడుతున్న విలేకరులు సేవలు హర్షనీయమన్నారు. సమాజంలో పత్రికా రంగంలో కనిపించని మూలస్తంభం అన్నారు. అంతకుముందే కారణాలే సిబ్బందికి స్థానిక విలేకరులు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో మీగడ సుబ్బారెడ్డి (ఈనాడు), బాలస్వామి (ఆంధ్రజ్యోతి), ఆంధ్రప్రభ (జాషువా), వెంకటేశ్వర రెడ్డి (రాజ్ న్యూస్), చంద్ర (టీవీ5), హుస్సేన్ (విశాలాంధ్ర) పాల్గొన్నారు.

భగత్ సింగ్ ఆశయాలకై యువత ఉద్యమించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర

విశాలాంధ్ర-కడప రూరల్ : భగత్ సింగ్ తక్కువ కాలం జీవించిన గొప్ప సైద్ధాంతిక ఆలోచన విధానాన్ని అందించాడని ఆయన ఆశయ సాధన కోసం యువత ముందుండి యువత పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర పిలుపినిచ్చారు. గురువారం కడపలోని నిహారిక స్కిల్ సెంటర్‌లో భగత్ సింగ్ 92 వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దురాక్రమణలో వున్న భారత దేశాన్ని విముక్తి చేసేందుకు భగత్ సింగ్ ఆయన సహచరులు రాజ్ గురు సుఖదేవ్‌లు కలిసి పోరాటం చేశారని, బ్రిటీషర్లకు వ్యతిరేఖంగా జరిగిన పోరాటంలో వారిని బందీలుగా చేసి మార్చ్ 23 1931న జైలు అక్రమముగా భగత్ సింగ్, రాజ్ గురు సుఖ్ దేవ్ లను ఉరి వేశారని, వారి అమరాత్వాన్ని ఇప్పటి యువత ఆదర్శనంగా తీసుకొని ప్రస్తుతం జరిగితున్న అన్యాయలపైన ఉద్యమించాలన్నారు. భగత్ సింగ్ కలలుగన్న సోషలిస్ట్ లక్ష్యాలను ఇప్పటి ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తూ కార్పోరేట్, ప్రైవేట్ వ్యక్తుల ఆర్థిక ప్రయో జ నాల కోసం దేశానికి అమ్మేస్తున్నా రని, ప్రభుత్వ రంగంలోని గనులు, పరిశ్రమాలను, ఎయి ర్పోర్ట్ లను, పోర్ట్ లను, రైల్వే, బీఎస్ఎన్ఎల్, ఎల్ఐ సీ ఇలా మొత్తం ప్రభుత్వ రంగాలను అమ్మేసి ప్రయివేట్ వ్యక్తులకు అప్పజెప్పడంతో పాటు యువతకు నిరుద్యోగాన్ని మిగుల్చుతున్నారని, దేశంలో రోజు రోజుకు నిరుద్యోగం, పెరుగుతుందని, ఈ తరుణంలో యువత ముందుకొచ్చి భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిను తీసుకొని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ద్రావిడ సురేష్, జిల్లా అధ్యక్షులు బి. దస్తగిరి, జిల్లా సహాయ కార్యదర్శి దేవా రాహుల్, నగర నాయకులు జోన్సన్ తదితరులు పాల్గొన్నారు.

బిఎల్ఓ లు విధుల్లో నిర్లక్ష్యం వద్దు

మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ రెడ్డి

విశాలాంధ్ర-సిద్దవటం : ప్రతి విషయంలో సిద్దవటం మండలం వెనుకుబాటులో ఉంద ని బిఎల్ఓలు విధు ల్లో నిర్లక్ష్యం వహిం చ వద్దని మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ రెడ్డి సూచించారు. మండ ల కేంద్రమైన సిద్దవటం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం బిఎల్ఓల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నాయని ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఓటర్ కార్డుకు ఆధార్ తో అనుసంధానం తప్పనిసరిగా చెయ్యాలన్నారు. జిల్లాలో సిద్దవటం మండలం 84 శాతం మాత్రమే నమోదు చేశారన్నారు. అలాగే ఓటర్ల జాబితా నుంచి మరణించిన వారి పేర్లను తొలగించాలన్నారు. రెండు, మూడు రోజుల్లో మండలవ్యాప్తంగా ఓటర్ తో ఆధార్ సీడింగ్ తప్పనిసరిగా చెయ్యాలన్నారు. అవసరమైతే మండల అధికారుల బృందం ప్రత్యేక డ్రైవ్ ను ఏర్పాటు చేసి త్వరిత గతిన పూర్తి చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శంకర్రావు, ఎంపిడిఓ ఫణిరాజ కుమారి, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, విఆర్ఏ తదితరులు పాల్గొన్నారు.

రైతులు చిరుధాన్యాల పంటలు పండించాలి

వ్యవసాయ శాఖ బద్వేల్ డివిజన్ ఏడిఏ ఎం. నాగరాజు

విశాలాంధ్ర-సిద్దవటం : రైతులు చిరుధాన్యాల పంటలు పండించాలని వ్యవసాయ శాఖ బద్వేల్ డివిజన్ ఏడిఏ ఎం. నాగ రాజు రైతులకు సూచిం చారు. మండలంలోని టక్కోలు రైతు భరోసా కేంద్రాన్ని గురువారం బద్వేల్ డివిజన్ ఏడిఏ ఎం. నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రంలోని ఎరువులు, రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. అలాగే దేగనవాండ్లపల్లి, లింగంపల్లి, కడపాయపల్లి గ్రామాలలోని నువ్వులు, ప్రొద్దుతిరుగుడు, కొర్ర పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఈ సంవత్సరము చిరుధాన్యాలైన కొర్ర, రాగి, అండు కొర్రలు, సామలు సజ్జలు వంటి పంటలను పండించమని రైతులకు సూచించడం జరిగిందన్నారు. అంతేగాక ఈ సంవత్సరాన్ని జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం జరిగిందన్నారు. కాబట్టి ఆసక్తిగల రైతులందరూ చిరుధాన్య పంటలను సాగు చేయమని రైతులకు సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే. రమేష్ రెడ్డి, రైతు భరోసా కేంద్ర ఇంచార్జ్ వంశీ, రైతులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు స్పందించి నోటీసు బోర్డు నాటిన అధికారులు: సిపిఐ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమా లకు స్టేట్మెంట్లకు ఓబులు వారిపల్లి రెవిన్యూ అధికారులు స్పందించి గురువారం బాలిరెడ్డి పల్లి దళిత గ్రామం పక్కన 1155 సర్వేనెంబర్ భూమిలో రెవిన్యూ అధికారులు హెచ్చరిక నోటీసు బోర్డు నాటారని సిపిఐ ఓబులవారిపల్లి మండల కార్యదర్శి సి నాగమ్మ పేర్కొన్నారు.పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్చరిక నోటీసు బోర్డు నాటడమే కాకుండా గతంలో నాటిన నోటీసు బోర్డు ఎవరు తొలగించారో వారిని గుర్తించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దొంగ ఆన్లైన్ చేసిన రెవెన్యూ సిబ్బందిని విధుల నుంచి తొలగించి న్యాయ విచారణ జరిపాల న్నారు.నిరుపేద దళితులకు న్యాయం చేయాలన్నారు. 1155 సర్వే నెంబర్ లోని 150 ఎకరాలు ప్రభుత్వ బంజర భూములను కాపాడు కుంటూ వస్తున్న బాలిరెడ్డిపల్లి దళితులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. హెచ్చరిక బోర్డుపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను కోరారు.

పంచుమర్తి అనురాధ విజయంపై ఆనందోత్సాహం

విశాలాంధ్ర-గోపవరం : పంచుమర్తి అనురాధ ఎమ్మెల్సీగా విజయం సాధించడంపై గురువారం సాయంత్రం బద్వేలు నాలుగు రోడ్ల కూడలిలో తెదేపా మున్సిపాలిటీ అధ్యక్షులు గుర్రంపాటి వెంగళరెడ్డి ఆధ్వర్యంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు ఘనంగా బాణసంచా పేల్చి ఆనందోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు నారా చంద్రబాబునాయుడు నాయకత్వం వర్ధిల్లాలి, విజయమ్మ నాయకత్వం వర్ధిల్లాలి, యువనేత రితేష్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగభూషణం, నారాయణరెడ్డి, అబ్రహాం, అనిల్, చిన్నికృష్ణారెడ్డి, మిత్తికాయల రమణ, అట్లూరు పార్టీ అధ్యక్షులు పి.మల్లికార్జునరెడ్డి, జహంగీర్‌బాషా, బిగ్‌బాస్, కెవి సుబ్బారెడ్డి, కొంకుల రాంబాబు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని అంతమొందించొచ్చు..

విశాలాంధ్ర-సుండుపల్లె : మరో రెండున్నరేళ్ళల్లో అంటే 2025 నాటికి టిబి (క్షయ) వ్యాధి రహిత భారత్‌గా దేశాన్ని తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర క్షయ నివారణ అధికారి డా. టి.రమేష్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ నివారణ దినోత్సవం మార్చ్ 24 సందర్భంగా అన్ని గ్రామాలలో వైద్య సిబ్బంది మార్చ్ 13 వ తేదీ నుంచి 24 వరకు ఇంటింటికి వెళ్లి క్షయ అనుమానితులను గుర్తిస్తూ పరీక్షలు చేసి క్షయ నిర్ధారణ అయితే చికిత్స అందిస్తున్నారని తెలిపారు. క్షయ అనేది అంటువ్యాధి అని, ఇది గాలి ద్వారా ఒక క్షయ వ్యాధి గ్రస్తుడు దగ్గినా, తుమ్మినా ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాపిస్తుంది అని, రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి, ఎచ్.ఐ.వి వ్యాధి గ్రస్థులకు క్షయ త్వరగా సంక్రమిస్తుందని తెలిపారు.క్షయ వ్యాధి గ్రస్థులకు మందులతో పాటు బలవర్ధకమైన పోషకాహారం అవసరం అని ఇందుకు దాతల సహకారంతో పేషంట్‌ల అంగీకారంతో దేశవ్యాప్తంగా 'ప్రధానమంత్రి - టిబి ముక్త్ భారత్ అభియాన్ - నిక్షయ్ మిత్ర' పథకాన్ని దేశ వ్యాప్తంగా గత ఏడాది సెప్టెంబర్ 9 న ప్రారంభిం చడము జరిగింది అని తెలిపారు. టిబి సోకిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మందులను సక్రమంగా 6 నెలలు పాటు మింగితే నయం అవుతుందని, క్షయ కొరకు ప్రభుత్వం ఉచితంగా పరీక్షలు, మందులు అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా ఒక్కొక్కరిన్ని 6 నెలల పాటు దత్తత తీసుకోవాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు, ప్రముఖ విద్యాసంస్థలు ముందుకు రావాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష్ సర్కులర్ కూడా ఇచ్చారని, దాతలు సహృదయం తో ముందుకు రావాలని, ఇతర వివరములకు మీ ప్రభుత్వ ఆసు పత్రలలోని టిబి విభాగం నందు సంప్రదించాలని, సహాయం చేయదలచిన వారు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబర్ 77760201006158 నందు జమచేయ వలెనని ప్రజలను కోరారు.

అంకాలమ్మ గుడి ఉత్సవాల సందర్భంగా బండలాగుడు పోటీలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : నగరంలోని చెమ్మిమియ్య పేట, తారకరామా నగర్, వెంకటేశ్వర డిగ్రీ కాలేజ్ వెనుక ఉన్న అంకాలమ్మ గుడి ఉత్సవాలు 22, 23 తేదీలలో జరుగునున్నట్లు ఆలయ నిర్వాహకులు లింగారెడ్డి, విశ్వనాథరెడ్డి, పల్లెపు రాజు, మురళి, రాజులు తెలిపారు. మంగళవారం ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ 22 వ తేదీ బుధవారం లోక కళ్యాణార్థమైన శాంతి హోమం జరుగుతున్నట్లు తెలిపారు. అలాగే 23 తేదీన గురువారం దేవాలయ ఉత్సవాల సందర్భంగా మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు అనంతరం మూడు గంటల నుండి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి 40వేలు పొలతల మాజీ చైర్మన్ వద్దే మాను విశ్వనాథరెడ్డి, రెండో బహుమతి 30 వేలు పోతిరెడ్డి పల్లె మూల సూర్య రెడ్డి, మూడో బహుమతి 20వేలు గోపులాపురం శ్రీనివాస మహేశ్వర్ రెడ్డి, నాలుగో బహుమతి 10వేలు ఒంటిమిట్ట మండలం పెద్దకొత్తపల్లి పోలు రమణయ్యులుగా పోటీలలో విజేతలకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ప్రజలు అమ్మవారి ఆశీస్సులు పొంది ఉత్సవాలలో పాల్గొన్నారు.

నాటు సారా తయారీ విక్రయాలపై ఉక్కుపాదం..

నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు

విశాలాంధ్ర -రాయచోటి టౌన్ : జిల్లాలో నాటు సారా తయారీ కేంద్రాలు, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులను అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. గురువారం జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులతో నిర్వహించిన నేర సమీక్షా సమావేశాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్నమయ్య జిల్లాను నాటు సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దుట కొరకు కృషి చేయాలన్నారు. నాటు సారా తయారీ మరియు విక్రయాలలో ఎక్కువ కేసులున్న వారిపై పీడీ యాక్ట్ కు సిఫార్సు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటి వరకు నాటు సారా తయారీ మరియు విక్రయాలు చేసే వారిపై నమోదు చేసిన కేసుల వివరాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సారా తయారు చేసే గ్రామాలలో అధికారులు రోజుకు రెండు మూడు గ్రామాలలో తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దుల చెక్ పోస్ట్ ల వద్ద అధికారులు నిరంతరం ఆకస్మిక వాహన తనిఖీలు చేయాలన్నారు. ఈ క్రమంలోనే పక్క రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణా నివారించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని మదనపల్లి, మొలకలచెరువు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిబ్బందికి సూచించారు. ఇందుకోసం సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను బలోపేతం చేయడానికి సాయుధ బలగాల నుంచి కూడా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. నాటు సారా తయారీ, అక్రమ రవాణాలో సంబంధం వున్న అనుమానితులను మండల ఎగ్జిక్యూటివ్ మాజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి వారిని బైండోవర్ చేయించాలని చెప్పారు. నమోదు చేసిన కేసుల్లో ఇన్వెస్టిగేషన్ ను త్వరితగతిన పూర్తి చేసి కోర్టులో చార్జీ టు దాఖలు చేసి తద్వారా ముద్దాయిలకు శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు, కేసులలో సీజ్ చేసిన వాహనాలను తక్షణమే వేలంపాట ద్వారా విక్రయించాల న్నారు. నాటు సారా తయారు చేసిన కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చిన ముద్దాయిలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపించడం ద్వారా వారిని తిరిగి నాటు సారా జోలికి వెళ్ళకుండా గౌరవ ప్రదమైన జీవితం జీవించేలా ప్రయత్నం చేయమని కౌన్సిలింగ్ ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ఈ సమీక్షలో ఎస్పితో పాటు అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్ కూడా పాల్గొన్నారు.

పెట్రేగిపోతున్న భూ కబ్జా వైసిపి నాయకులు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: అన్నమయ్య జిల్లా రాయచోటి మాసాపేటలో ఇంజనీరింగ్ కాలేజ్ ఎదురుగా ఉన్న 242 సర్వే నెంబర్ లో 2.08 ఎకరాలను యద్దేశగా ఎమ్మెల్సీ బంధువైనటువంటి అలీ నవాజ్ ఖాన్ వైసిపి బడా నాయకులు నలుగురు చేరుకొని భారీ భూ కబ్జా దిశగా కొనసాగిస్తున్నారు. దీనికి సంబంధించి కోట్ల విలువగల డీకేటీ భూమిని ఎమ్మెల్సీ బంధువు అయినటువంటి కె అలీ నవాజ్ ఖాన్ ఆధ్వర్యంలో వైసీపీ ముఖ్య నేతలు నలుగురు ఉన్నట్లు సమాచారం. దీనికి సంబంధించి అతి త్వరలోనే ఈ భూకబ్జాదారులపై హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ పెద్దపల్లి శేఖర్ త్వరలోనే జిల్లా కలెక్టర్ కు సంబంధిత పత్రాలు తీసుకెళ్లి కబ్జాదారులపై తగు చర్యలు తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ గా తనవంత శైలిగా భూకబ్జా ఆక్రమణకు గురికాకుండా చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం తన కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ భూమి గతంలో గగ్గుటూరు చిన్న కమల్ సాహెబ్ డీకేటీ డి ఫారం ఇచ్చిన పరిస్థితి ఉంది. అయితే ఇతను గతంలో విక్రయించడానికి చూసిన గతంలో ఇతనికి భూమి రద్దు పరచి పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన పరిస్థితి అయితే ఉంది. గతంలో ఈ భూమిపై సిపిఐ సిపిఎం పలు ప్రజా సంఘాలు కూడా పేద ప్రజలకు ఇచ్చిన ఇళ్ల పట్టాల కోసం భారీ స్థాయిలో నిరసన తెలిపిన పరిస్థితులు ఉన్నాయి. ఈ భూమిపై గతంలో గగ్గుటూరు కమల్ సాహెబ్ కోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం వారు ఈ సర్వే నెంబర్ 242 లో గల రెండు ఎకరాల 8 సెంట్లు ను గగ్గుటూరు కమల్ సాబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు న్యాయస్థానం ఈ భూమిని గవర్నమెంట్ అధికారులకు అమ్మటానికి కొనటానికి వీలు లేదని ఆర్డర్ పాస్ చేసిన పరిస్థితి ఉంది అయితే గగ్గుటూరు చిన్న కమల్ సాబ్ కుమారుడు గగ్గుటూరు కమల్ సాహెబ్ ఇతని కుమారులు గగ్గుటూరు మమ్మద్ రఫీ గగ్గుటూరు నసరుద్దీన్ గగ్గుటూరు సిరాజుద్దీన్ కలిసి భూ విక్రయ జరిగినట్లు తెలుస్తోంది. పట్టాదారులు అయినటువంటి గగ్గుటూరు చిన్న కమల్ సాహెబ్ గవర్నమెంట్ నార్మ్స్ ప్రకారం ఈ భూమిని విక్రయించకూడదు అని తెలిసి కూడా విక్రయించిన పరిస్థితి అయితే ఉంది కోర్టు ఆర్డర్ ను కూడా లెక్కచేయకుండా వైసిపి బడ నాయకులతో చేతులు కలిపి విక్రయించిన తీరును ప్రజలు ధ్రుయపడ్డారు. అతి త్వరలోనే ఇళ్లపట్టాలిచ్చిన బీద కుటుంబాలకు న్యాయం జరిగేలా చేస్తానని సదురు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ పెద్దపల్లి శేఖర్ తెలిపారు.

ఆందోళన వద్దు.. నివారణే మార్గం.!

నేడు ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం

విశాలాంధ్ర -రాజంపేట: ప్రతియేడాది మార్చి 24న యావత్ ప్రపంచం అంతర్జాతీయ క్షయవ్యాధి దినోత్సవం జరుపుకుం టుంది. ఈ రోజు డాక్టర్ రాబర్ట్ కోచ్.. టీబీకి కారణమయ్యే బ్యాక్టీరియాను కనుగొన్నారు. 1882 నాటి ఆవిష్కరణను స్మరించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు. గాలి ద్వారా సంక్రమించే వ్యాధి. టీబీ అని కూడా పిలిచే ఈ వ్యాధి ఒకప్పుడు మహమ్మారిలా ప్రపంచ ప్రజలను వేధించేది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికే ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. హెచ్ఐవి ఉన్న వారికి క్షయ తొందరగా ఎటాక్ అవుతుందని వారు అంటున్నారు.

ఈ వ్యాధి ఎలా వస్తుందో ముందుగా చూద్దాం

గాలి ద్వారా సంక్రమించే క్షయ అంటు వ్యాధి

వాతావరణం లోని హానికర గాలులు, క్రిములు, కాలుష్యం ఊపిరితిత్తులలోకి చొరబడడం ద్వారా క్షయ వ్యాధి వస్తుంది.టీబీ వ్యాధిగ్రస్తులు తుమ్మినా, దగ్గినా ఆ పక్కన ఉన్న వారికి ఈ వ్యాధి వ్యాపించే అవకాశాలు ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 2.3 బిలియన్ల మంది క్షయతో బాధపడుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.ఈ వ్యాధి లక్షణాలు అంత తీవ్రంగా ఉండవు. దీంతో క్షయ పట్ల రోగులు, వారి బంధువులు కూడా అశ్రద్ధ చూపిస్తారని వైద్యులు అంటున్నారు.శరీరంలో క్షయ బ్యాక్టీరియా చురుకుగా ఉన్నా రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నా క్షయ తొందరగా వ్యాపించే అవకాశాలు ఉన్నాయి.ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలోనే క్షయ వ్యాధి ఎక్కువగా ఉందని పరిశోధకులు చెబుతున్నారు.టీబీ తొలుత ఊపిరితిత్తులో చేరి ఆ తర్వాత మూత్ర పిండాలు, చివరకు మెదడుకు చేరుతుంది.

క్షయ వ్యాధి, లక్షణాలు

ఈ వ్యాధి సోకిన వారిని ఎడతెగని దగ్గు వేధిస్తుంది. అలాగే కాలంతో సంబంధం లేకుండా చెమటలు పోస్తాయి. విపరీతమైన నీరసం ఆవహిస్తుంది. రాత్రి వేళల్లో తరచుగా జ్వరం వస్తున్నా క్షయ వ్యాధి సోకినట్లుగా అనుమానించాలి.వాతావరణం చల్లగా ఉన్నప్పటికి కూడా విపరీతంగా చెమటలు పడితే అది క్షయ వ్యాధికి ప్రధాన లక్షణంగా గుర్తించాలి. ఊపిరి పీల్చే సమయంలో పిల్లికూతలు, ఈల వేస్తున్నట్టుగా శబ్దాలు వస్తే వెంటనే డాక్టర్ని సంప్రదించాలి.

క్షయ వ్యాధి సోకిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

క్షయ వ్యాధి వచ్చిందని నిర్ధారణ కాగానే ధూమపానం, పొగాకు, మద్యం, కాఫీ, టీ తాగడం వంటివి మానివేయాలి. ఆహార పదార్థాల్లో నూనె వాడకం తగ్గించాలి. కొలెస్ట్రాల్, మాంసాహారం తీసుకోవడం కూడా వెంటనే నిలిపివేయాలి.

క్షయ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన ఆహారం

ఆకు కూరలు ఎక్కువగా తినాలి. బచ్చలి కూర ఈ వ్యాధిని నివారించడంలో ఎంతో మేలు చేస్తుంది. క్యారెట్, చెర్రీస్, తాజా కూరగాయలు, పండ్లు, బీన్స్, బ్రోకాలి వంటివి ఎక్కువగా తీసుకోవాలి. టమాటాలు, బ్లూబెర్రీస్, చెర్రీస్, పాలకూరతో పాటు గోధుమలతో చేసిన ఆహార పదార్థాలు ఎక్కువగా తినాలి.ఈ జాగ్రత్తలతో పాటు డాక్టర్ల సలహాలు, సూచనలు పాటిస్తూ క్రమం తప్పకుండా మందులు వాడాలి. ఇలా జాగ్రత్తలు తీసుకుంటే క్షయ భయపడే వ్యాధి కాదు.గతంతో పోలిస్తే క్షయ వ్యాధి పట్ల అంత భయం అవసరం లేదంటున్నారు వైద్య నిపుణులు. గతంలో క్షయ నివారణకు ఇన్ని సదుపాయాలు, మందులు కూడా అందుబాటులో ఉండేవి కావు. ఆధునిక కాలంలో మాత్రం టీబీని నియంత్రించేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. అయితే ఈ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటేనే ఎంతో మేలు.

దాతల సహకారంతో పౌష్టికాహారం అందిస్తున్నాం

జయ ప్రకాష్ సీనియర్ టీబీ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్

ప్రతి క్షయ రోగికి ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ ప్రోగ్రాం ద్వారా దాతలతో దత్తతకు తీసుకొని 6 నెలలకు సరిపడే పౌష్టిక ఆహారాన్ని అందజేయడం జరుగుతుందన్నారు.రాజంపేట టీబీ ట్రీట్మెంట్ యూనిట్ పరిధిలో ఉన్నటువంటి ఆకేపాడు, నందలూరు, రాజంపేట మన్నూర్, ఈడిగపాలెం అర్బన్ హెల్త్ సెంటర్స్ వైద్య సిబంది నిత్యం అందుబాటులో ఉండడం జరుగుతుందన్నారు. రాజంపేట టీబీ ట్రీట్మెంట్లో ఇప్పటికి 80 మంది క్షయ వ్యాధి గ్రాస్తులని గుర్తించమన్నారు.నిత్యం ఆశ వర్కర్స్ ఆధ్వర్యంలో మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు.టీబీ వ్యాధి లక్షణాలు రెండు వారాలమించి దగ్గు, రాత్రి పూట జ్వరంరావడం, ఆకలి మందగించడం, బరువు తగడం, ఛాతిలో నొప్పి, తగ్గినప్పుడు గళ్ళలో రక్తం పడడం ఇలాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేసుకోవాలన్నారు.